


నమస్తే

# మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

ఆదివారం
23-08-2026 సంపుటి : 01 సంచిక :152 పేజీలు : 08 వెల :₹ 5/-




Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్ బై

- లాంచ్ వెహికల్స్ తయారీ నుంచి క్రమంగా తప్పుకోనున్న ఇస్రో
- ప్రైవేట్ రంగానికి రాకెట్ల తయారీ, ఉత్పత్తి బాధ్యతలు
- ఎస్ఎస్ఎల్వీ టెక్నాలజీ, ఉత్పత్తి హక్కులు ఇప్పటికే హెచ్ఏఎల్ కు బదిలీ
- తదుపరి దశలో పీఎస్ఎల్వీ, ఎల్వీఎం3 తయారీ
- ఇకపై ఇస్రో పరిశోధన, అత్యధునిక సాంకేతికతలపై దృష్టి

03

### ప్రైవేట్ రంగానికి కీలక బాధ్యతలు

భారత అంతరిక్ష రంగంలో భారీ మార్పులకు ఇస్రో శ్రీకారం చుట్టింది. రాకెట్లు, సాధారణ ఉపగ్రహాల తయారీ వంటి కార్యకలాపాల నుంచి క్రమంగా తప్పుకుని, పరిశోధన, అత్యాధునిక సాంకేతికతల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించింది. లాంచ్ వెహికల్స్ తయారీ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగిస్తూ అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని మరింత పెంచనుంది. 2033 నాటికి భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 44 బిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ఈ కీలక మార్పులు చేపడుతోంది.



03

### దౌత్యనీతి అంటే కేవలం టీ20లు కాదు..
## టెస్టులూ ఉంటాయ్

- అంతర్జాతీయ సమస్యలకు సహనం, దీర్ఘకాలిక దృష్టి అవసరం
- పశ్చిమాసియా యుద్ధం టెస్టు సిరీస్‌లా సాగుతోందన్న జైశంకర్
- భౌగోళిక రాజకీయ సవాళ్ల మధ్య 'డి-రిస్కింగ్'పై దృష్టి
- ఒకే వనరుపై ఆధారపడొద్దు.. ప్రత్యామ్నాయాలు పెంచుకోవాలి
- సరఫరా గొలుసు అంతరాయాలకు ముందస్తు ప్రణాళికలు కీలకం
- ఇంధనం, ఎరువులు, రవాణాపై ప్రపంచ ఉద్రిక్తతల ప్రభావం
- వైవిధ్యం, పెట్టుబడుల భద్రతతో ప్రమాదాలను తగ్గించుకోవచ్చు

# నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

### హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం

- అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు భాగస్వామ్యం కావాలి
- కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో విద్యా, పరిశోధన రంగాలపై చర్చలు
- హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలకు కేంబ్రిడ్జ్ ఆసక్తి
- సంయుక్త పరిశోధనలు, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకారం
- యువ పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్ అవకాశాలపై కసరత్తు
- తెలంగాణతో భాగస్వామ్యానికి కేంబ్రిడ్జ్ విద్యావేత్తల సుముఖత
- ప్రత్యేక సహకార వ్యవస్థ ఏర్పాటుకు ఇరు వర్గాల అంగీకారం
- కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్, ఆగస్టు 22 (మహాప్రభ)

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. యూకే పర్యటనలో భాగంగా లండన్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలతో సమాలోచనలు జరిపారు. తెలంగాణ రైజింగ్ అధికారిక ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్ నాయకత్వం వహించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారుడు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌తో కలిసి

-మిగతా 3 లో






### భూ భారతితో కాంగ్రెస్
## నవ్వులపాలు..

- భూభారతి, 22ఏ పేరిట భూదోపిడీ, సెటిల్‌మెంట్లు
- కావాలనే నిషేధ జాబితాలో చేర్చి 50శాతం కమీషన్లు
- రేవంత్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 22 (మహాప్రభ)

రాష్ట్రంలో భూభారతి చట్టం తో కాంగ్రెస్ సర్కార్ నవ్వుల పాలైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. భూభారతి, 22ఏ నిషేధిత జాబితా పేరిట రాష్ట్రంలో భారీ భూదోపిడీ జరుగుతున్నదని ఆరోపించారు. పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు విచ్చలవిడిగా సెటిల్‌మెంట్ల దందా సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ, దేవాదాయ భూములు మాత్రమే ఉండాల్సిన 22ఏ జాబితాలోకి దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తూ, నివాసాలు ఉంటున్న ప్రైవేట్ ఇండ్లు, స్థలాలను ఉద్దేశపూర్వకంగా చేర్చి సెటిల్‌మెంట్ల పేరిట 50 శాతం కమీషన్లు దం డుకుంటున్నారని మండిపడ్డారు. వంద ఎకరాలు ఉంటే లిటిగేషన్ క్లియర్ చేస్తా.. 50 ఎకరాలు ఇస్తావా? అన్నరీతిలో సెటిల్మెంట్లు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే సుమారు 4 లక్షల ఎకరాల భూ

-మిగతా 3 లో



03

### దేశమంతటా
## వందేమాతరం

- ప్రచార కార్యక్రమానికి బీజేపీ తీర్మానం
- రెండు చరణాలకే పరిమితమున్న కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తున్నాం
- పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వెల్లడి
- బీజేపీలో జెన్ జీ కమిటీ ఏర్పాటు
- నితిన్ నబీన్ టీంతో ప్రధాని మోడీ భేటీ


### నాలుగేళ్లలోపు చిన్నారులకు
## ఆ మందులు వాడొద్దు

- జలుబు, దగ్గు మందులపై కేంద్రం కొత్త ఆంక్షలు
- నాలుగేళ్లలోపు చిన్నారులకు ఎఫ్‌డీసీ ఔషధాలు నిషేధం
- మందుల ప్యాకెట్లపై హెచ్చరిక తప్పనిసరి
- నిపుణుల కమిటీ, డీటీఏబీ సిఫార్సులతో నిర్ణయం
- చిన్నారుల ఆరోగ్య భద్రతే లక్ష్యమన్న కేంద్రం
- ప్రత్యామ్నాయ సురక్షిత ఔషధాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడి
- తయారీ, విక్రయాలు, పంపిణీపై కఠిన నిబంధనలు
- డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ కింద నోటిఫికేషన్ జారీ
- 2025 ఆంక్షలను అన్ని ఫార్ములేషన్లకు విస్తరించిన కేంద్రం
- చిన్నారులపై ప్రతికూల ప్రభావాల నేపథ్యంలో కీలక నిర్ణయం



03

### షహబాజ్ సర్కారుకు
## బిగుస్తున్న ఉచ్చులు..



03

### పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీర్యం
# చేయొద్దు

### జీవో 97 రద్దు చేయాలి



- సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలి
- మంత్రిమండలి ఆమోదించిన బిల్లును ఉపసంహరించుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 22 (మహాప్రభ)

రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఏఐసీటీఈ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే, ఎస్‌బీటీఈటీ బోర్డు పర్యవేక్షణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యథాతథంగా కొనసాగించాలని స్పష్టంచేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలోకి విలీనం చేసేలా మంత్రిమండలి ఆమోదించిన బిల్లును ఉపసంహరించుకోవాలని

-మిగతా 3 లో

### కమిషన్ల కోసం
# కాళేశ్వరం

### రూ.లక్ష కోట్లు నీళ్లపాలు

- పేదల సంక్షేమాన్ని బీఆర్ఎస్ పట్టించుకోలేదు
- నిజామాబాద్‌కే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు
- 15-20 రోజుల్లో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన
- 400 ఇందిరమ్మ ఇళ్లను లాటరీ ద్వారా కేటాయింపు
- సిమెంట్ బస్తా రూ.230కే ఇందిరమ్మ ఇళ్లకు
- పాత ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు
- నిజామాబాద్‌లో 10కిపైగా కొత్త కార్యాలయాలకు శంకుస్థాపనలు
- ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ ఫలాలు
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ప్రభుత్వ పెద్దపీట



నిజామాబాద్ ప్రతినిధి :ఆగస్టు 22 (మహాప్రభ)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని నీళ్లల్లో పోసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు

-మిగతా 3 లో

# హర్మూజ్‌పై ట్రంప్ కొత్త మెలిక

**ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు**



**వాషింగ్టన్, ఆగస్టు 22 (మహాప్రభ)**
పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసాయి తారా స్థాయికి చేరేలా ఉన్నాయి. హర్మూజ్ జలసంధి విషయంలో ఇరుదేశాలు పట్టువీడకపోవడమే అందుకు కారణం. హర్మూజ్‌ను తమ భూభాగంగా ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌పై ఆర్థికపరమైన ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. అయినా సరే ఇరాన్ మాత్రం వెరవడం లేదు. మరోసారి తమను భయపెట్టాలని చూస్తే విధ్వంసకరంగా బదులిస్తామని పేర్కొంది టెహ్రాన్. ఆరు నెలలకు పైగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభాం చూపిస్తోంది ఇరాన్ ఇజ్రాయేల్ అమెరికా యుద్ధం. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడం.. అమెరికా మాత్రం ఆ జలసంధిని తమ భూభాగంగా ప్రకటించడం తాజాగా మరింత ఉద్రిక్తతలకు ఆజ్యం పోశాయి.

# పాట్నాలో పోలీసులతో నిరుద్యోగుల ఘర్షణ



**పాట్నా, ఆగస్టు 22 (మహాప్రభ)**
పారదర్శకంగా నియామక ప్రక్రియ జరగాలని కోరుతూ పాట్నాలోని లోక్‌భవన్‌కు ర్యాలీ నిర్వహిస్తున్న సందర్భంగా పోలీసులతో ఘర్షణ పడిన పలువురు నిరుద్యోగులు అరెస్టయ్యారు. పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్న ఈ ర్యాలీని ఆర్-గోలుంబర్ సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను ఛేదించుకొని వెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించడంతో ఘర్షణ చెలరేగింది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా సిబ్బంది స్వల్ప బలప్రయోగం చేసినట్టు అధికారులు తెలిపారు. అనంతరం పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

# ఎంకే-2 తేజస్ ఫైటర్ జెట్లతో ఉపయోగం ఉండదు

**-ఆరో తరం జెట్లతో దూసుకుపోతుంటే ఇంకా 4వ తరంలోనే మిగిలిపోదామా?**
**-మాజీ ఎయిర్ మార్షల్ వివాదాస్పద వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 22 (మహాప్రభ)**
మన శత్రు దేశాలైన చైనా, పాక్‌లు 5, 6వ తరం జెట్ విమానాల వైపు దూసుకుపోతుంటే మనం 4వతరం జెట్‌ల వైపే అడుగులు వేయడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్వదేశీ తేజ్ జెట్ ఫైటర్ ప్రాజెక్టుపై ఎయిర్ మార్షల్ నాగేశ్ కపూర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2030ల మధ్య కాలంలో అవి గణనీయ సంఖ్యలో సేవల్లోకి దిగినా, ముందు వరుస పాత్రలో కార్యాచరణగా ఉపయోగకరంగా ఉండకపోవచ్చునని పేర్కొన్నారు. యూఎస్ ఎఫ్-22 లేదా చైనీస్ జే-20 నాటి ఐదో తరం ఫైటర్ జెట్లను సెన్సార్ ఫ్యూజన్, ఆయుధాల అంతర్గత క్యారేజ్‌తో రాడార్‌పై ట్రాక్ చేయడం కష్టతరమవుతుందని తెలిపారు. ఇక చైనా రూపొందించిన ఆరోతరం యుద్ధ విమానాలైన జే-36, జే-50 డ్రోన్ వింగ్‌మెన్‌లతో ఏఐతో నడిచే స్వయంప్రతిపత్తిని జోడించి స్టెల్త్ ఫౌండేషన్‌పై నిర్మించారన్నారు

# హెచ్ 1బీ ఫీజుల సవరణకు వైట్‌హౌస్ ఆమోదం

**భారతీయ టెకీలపై ప్రభావం ఎంత?**




**వాషింగ్టన్:ఆగస్టు 22 (మహాప్రభ)**
అమెరికాలో విదేశీ నిపుణులకు ఇచ్చే హెచ్1బీ వీసా పిటిషన్ ఫీజులను సవరించేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తెచ్చిన ప్రతిపాదనపై వైట్‌హౌస్ సమీక్ష పూర్తి చేసుకున్నది. రాబోయే కొద్ది వారాల్లో దీనికి సంబంధించిన పూర్తి ముసాయిదాను ప్రభుత్వం ప్రజల పరిశీలనకు ఉంచనున్నది. ముందుగా ప్రభుత్వం ఈ ప్రతిపాదనను అధికారికంగా ప్రచురించి, సాధారణ ప్రజలు, సంస్థల నుంచి సలహాలు, అభిప్రాయాలు స్వీకరిస్తుంది. ఈ పరిణామం భారతీయ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అమెరికా ఇచ్చే హెచ్1బీ వీసాలు, ఉద్యోగ పొడిగింపుల్లో భారతీయులదే సింహభాగం

# అమెరికాలో వృద్ధులను టార్గెట్ చేస్తూ 7.5 మిలియన్ల డాలర్ల స్కామ్..

**-21 ఏళ్ల భారతీయ వ్యక్తి అరెస్టు**

**న్యూయార్క్ ఆగస్టు 22 (మహాప్రభ)**
అమెరికాలో వృద్ధులను టార్గెట్ చేస్తూ సుమారు 7.5 మిలియన్ డాలర్ల స్కామ్(ఖూ ూఝఎ)కు పాల్పడిన 21 ఏళ్ల భారత సంతతి వ్యక్తిని అరెస్టు చేశారు. అమెరికా కోర్టులో అతనిపై నేరాభియోగాన్ని నమోదు చేశారు. నిందితుడిని గుజరాత్‌కు చెందిన జయ సునిల్‌భారతి గోస్వామిగా గుర్తించారు. అతను న్యూజెర్సీలో నివసిస్తున్నాడు. అయితే ఖతార్‌కు పరారీ అయ్యేందుకు ప్రయత్నిస్తున్న అతన్ని కెనడాలో పట్టుకున్నారు. వైర్ ఫ్రాడ్, మనీల్యాండరింగ్ కేసులను అతనిపై నమోదు చేసినట్లు యూఎస్ అటార్నీ మైఖేల్ డిజియాకమో తెలిపారు. ఒకవేళ అతనిపై నేరం రుజువైతే, అతనికి 20 ఏళ్ల జైలు శిక్ష పడనున్నది. వృద్ధ బాధితుల నుంచి నగదు, బంగారం కలెక్టు చేసినట్లు



తెలుస్తోంది. వెస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ ఆధారంగా ఫ్రాడ్ స్కీమ్‌కు పాల్పడినట్లు జనవరిలో గుర్తించారు. ఐఆర్ఎస్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డివిజన్ దీనిపై ఆరా తీసింది. బ్యాంకు అకౌంట్లు, పర్సనల్ ఇన్ఫర్మేషన్ కంప్రమైజ్ అయినట్లు తొలుత బాధితులను నమ్మించారు. ఆ తర్వాత వారి ఆస్తులను.. నగదు, బంగారం, గిఫ్ట్ కార్డులుగా మార్చుకోవాలని వత్తిడి తెస్తారు. పోలీసులమని చెప్పి స్కీమ్‌లోకి దింపుతారు. మనీ మ్యూల్ పాత్రలో గోస్వామి వ్యవహరించినట్లు అమెరికా కోర్టు తేల్చింది. బాధిత వృద్ధుల నుంచి వ్యక్తిగతంగా గోల్డ్ లేదా డబ్బును సేకరించేవారు. న్యూయార్క్, న్యూజెర్సీల్లో 9 సార్లు వృద్ధ బాధితుల నుంచి క్యాష్, గోల్డ్ సేకరించాడు. ఆ బాధితుల వయసు 59 నుంచి 87 మధ్య ఉంది. బ్యాంక్ ఆఫ్ అమెరికాలో గోస్వామి అకౌంట్ ఓపెన్ చేసి, సుమారు 90 వేల డాలర్ల క్యాష్ డిపాజిట్ చేశాడు. 2025 ఆగస్టు నుంచి 2026 ఏప్రిల్ వరకు ఈ దందా సాగించాడు. 2026, ఆగస్టు 17వ తేదీన అమెరికా మెజిస్ట్రేట్ జడ్జ్ మార్క్ డబ్ల్యూ పీడర్‌సెన్ షరతుల మీద గోస్వామిని రిలీజ్ చేశారు. అయితే తర్వాత రోజు పీస్ బ్రిడ్జ్ మార్గంలో అతను కెనడాకు పరారీ అయ్యాడు. ఇక టొరంటో నుంచి దోహాకు ఫ్లయిట్ బుక్ చేసుకున్నాడు. కానీ టొరంటో విమానాశ్రయంలో పోలీసులు అతన్ని పట్టుకున్నారు.

# ఫ్రాన్స్‌లో తొలి హిందూ దేవాలయం.. సెప్టెంబర్‌లో ఘనంగా ప్రారంభం..!

**న్యూఢిల్లీ, ఆగస్టు 22 (మహాప్రభ)**
ఫ్రాన్స్ లో హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ మొట్టమొదటి భారీ హిందూ దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పారిస్ లోని బుస్సీ-సెయింట్-జార్జెస్ ప్రాంతంలో బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ నిర్మించిన ఈ స్వామినారాయణ్ హిందూ మందిరాన్ని సెప్టెంబర్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2 నుంచి 14వ తేదీ వరకు 13 రోజులపాటు 'ఫెస్టివల్ ఆఫ్ కల్చర్' పేరిట ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలను బీఏపీఎస్ ఆధ్యాత్మిక గురువు మహంత్ స్వామి మహరాజ్ తన ఆశీస్సులతో పర్యవేక్షించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు, శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ ఆలయ ప్రారంభోత్సవం, సాంస్కృతిక ఉత్సవాల గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సత్సంగ సభల్లో మార్చి, ఏప్రిల్ నెలల్లోనే బీఏపీఎస్ అధికారికంగా ప్రకటించింది. యూకే,



యూరప్ దేశాల బీఏపీఎస్ హెడ్ యోగవివేక్‌దాస్ స్వామి ప్రత్యేక వీడియో సందేశం ద్వారా ఈ ఆలయ చారిత్రక ప్రాధాన్యతను, ఉత్సవాల వివరాలను తెలియజేశారు. ఈ ఆలయ నిర్మాణంలో ఒక విశేషం ఉంది. ఆలయానికి అవసరమైన రాళ్లను భారత్ నుంచి ఫ్రాన్స్‌కు తరలించారు. ఈ రాళ్లను భారత శిల్పులతో చెక్కించి, వాటిని అక్కడ ఆలయ నిర్మాణంలో ఉపయోగించారు. అంటే ఈ ఆలయం భారతదేశంలో తయారై.. ఫ్రాన్స్‌లో నిర్మించబడింది. ఇది తమకు ఎంతో గర్వకారణమని ఫ్రాన్స్‌లోని ప్రవాస భారతీయురాలు భావి పరేఖ్ ఆనందం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన తర్వాత ఇప్పుడు ఈ ఆలయ ప్రారంభోత్సవం తమకు మరో ముఖ్యమైన సందర్భమని ఆమె తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం ఈ ఆలయాన్ని సందర్శించాలని బీఏపీఎస్‌తో అనుబంధం ఉన్న మరో ప్రవాస భారతీయుడు ఆహ్వానించారు. సెప్టెంబర్‌లో జరిగే 13 రోజుల కార్యక్రమాలకు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. ఆలయ ప్రారంభోత్సవానికి ఇప్పటికే శిఖరాలు, మధ్య గోపురంపై 'కలశ', 'ధ్వజ దండ పూజలు' వంటి పవిత్ర కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య శాంతి, సామరస్యం, శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మహంత్ స్వామి మహరాజ్, సీనియర్ స్వాములు, భక్తులు 'పారిస్ మందిర్ మహోత్సవని జై!' అంటూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ ఆలయ ప్రారంభంతో ఫ్రాన్స్‌లోని హిందూ సమాజ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుండగా.. ఇది సందర్శకులకు గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుభూతిని అందిస్తుందని భావిస్తున్నారు.

# 15 అడుగుల కొండచిలువకు క్యాన్సర్..

**మనుషులకు చేసే చికిత్సతో నయం చేసిన బ్రిటన్ వైద్యులు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 22 (మహాప్రభ)**
బ్రిటన్ వైద్యులు అరుదైన వైద్యంతో ఓ కొండచిలువకు ప్రాణం పోశారు. క్యాన్సర్‌తో పోరాడుతున్న 15 అడుగుల కొండచిలువకు మనుషులకు ఉపయోగించే అధునాతన చికిత్స అందించి నయం చేశారు. దవడలోని ప్రాణాంతక కణితిని తొలగించడంతోపాటు ఎలక్ట్రోకెమోథెరపీ నిర్వహించడంతో క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకుంది. ప్రస్తుతం మళ్లీ చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నట్లు బ్రిటన్‌లోని చెస్టర్ జూ వెల్లడించింది. ఇంగ్లాండ్‌లోని చెస్టర్ జూలో ఉన్న 23 ఏళ్ల రెటిక్యులేటెడ్ పైథాన్ 'జోడీ ఫోస్టర్' ఇటీవల అనారోగ్యానికి గురైంది. సుమారు 50 కిలోల బరువున్న ఈ కొండచిలువ కొంతకాలంగా ఆహారం తీసుకోవడం తగ్గించింది. చురుకుదనం కూడా తగ్గింది. దీంతో జూ సిబ్బంది వైద్య పరీక్షలు చేయగా.. దాని దవడలో ఫైబ్రోసార్కోమా అనే ప్రాణాంతక క్యాన్సర్ కణితి ఉన్నట్లు తేలింది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి క్యాన్సర్ కణితిని తొలగించారు. అయితే కొంతకాలానికి క్యాన్సర్ మళ్లీ తిరగబడింది.




ఈ సారి దవడతో పాటు ఎముకలోకి కూడా క్యాన్సర్ కణితి వ్యాపించడం వైద్యులు గుర్తించారు. దీంతో మరోసారి శస్త్రచికిత్స చేయడం మాత్రమే సరిపోదని వైద్యులు భావించారు. దానికి ఎలాంటి చికిత్స అందించాలనే దానిపై చెస్టర్ జూ వెటర్నీ బృందం.. యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్ క్యాన్సర్ నిపుణులను సంప్రదించింది. అందరూ కలిసి ఎలక్ట్రోకెమోథెరపీ అనే అధునాతన వైద్య చికిత్సను పాముకు అనుగుణంగా మార్చడం ద్వారా క్యాన్సర్ నయం చేయవచ్చని ఒక అంచనాకు వచ్చారు. ఈ మేరకు మనుషుల్లో క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే ఎలక్ట్రోకెమోథెరపీ విధానాన్ని తొలిసారిగా ఓ పాముపై ప్రయోగించారు. ఈ చికిత్సలో క్యాన్సర్ కణాలపై ప్రభావం చూపే బ్లీమైసిన్ అనే ఔషధాన్ని ఉపయోగిస్తారు. అనంతరం కణితి ప్రాంతంలో నియంత్రిత విద్యుత్ పల్స్‌లను పంపిస్తారు. తద్వారా మిగిలి ఉన్న క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకుని నాశనం చేయడానికి ప్రయత్నిస్తారు. అయితే 15 అడుగుల పొడవు, 50 కిలోల బరువు ఉన్న పాముకు ఆపరేషన్ చేయడం వైద్యులకు మరో సవాల్‌గా మారింది. సాధారణ ఆపరేషన్ టేబుల్ సరిపోకపోవడంతో రెండు టేబుళ్లను కలిపి దాదాపు డబుల్ బెడ్ పరిమాణంలో ఏర్పాటు చేశారు. జోడీకి దాని నివాస ప్రదేశంలోనే మత్తు ఇచ్చారు. అనంతరం ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. ముందుగా క్యాన్సర్ కణితితోపాటు వ్యాధి సోకిన దవడ ఎముక భాగాన్ని తొలగించారు. ఆ తర్వాత ఎలక్ట్రోకెమోథెరపీ ద్వారా మిగిలి ఉండే క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకున్నారు. చికిత్స జరిగి కొన్ని నెలలు గడిచిన తర్వాత నిర్వహించిన పరీక్షల్లో జోడీ ఫోస్టర్ క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్నట్లు వైద్యులు నిర్ధారించారు. దవడలో కొంత భాగాన్ని కోల్పోయినప్పటికీ.. దాని ఆహారం తీసుకునే సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం పడలేదు. వేటాడడంలోనూ ఇబ్బందులు లేవని జూ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జోడీ మళ్లీ మునుపటిలాగే చురుగ్గా, ఉత్సాహంగా ఉందని వెల్లడించారు.

# అభిజీత్ దీప్కే డెడ్‌లైన్..

**పశువుల పాక నుంచి నుంచి మారిన ప్రభుత్వ పాఠశాల**

**జైపూర్: ఆగస్టు 22 (మహాప్రభ)**
కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే 48 గంటల డెడ్‌లైన్‌తో గ్రామస్తులు, అధికారులు దిగివచ్చారు. పశువుల దొడ్డిలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలను మరో చోటకు మార్చారు. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 'పాఠశాలలు బాగుచేసుకుందాం' అనే ప్రచారంలో భాగంగా సీజేపీ కో కన్వీనర్ అశుతోష్ రాంకా, మరికొందరు సభ్యులు ఒక గ్రామానికి వెళ్లగా స్థానికులు వారిని అడ్డుకుని తరిమికొట్టారు. ఈ సందర్భంగా ఘర్షణ చెలరేగింది. కాగా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దీనిపై తీవ్రంగా



స్పందించారు. ప్రభుత్వ స్కూల్ భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల చదువులు పశువుల పాకలో కొనసాగడంపై ఆయన మండిపడ్డారు. 48 గంటల్లోగా చర్యలు తీసుకోకపోతే జైపూర్‌లో తాను ధర్నాకు దిగుతానని, శుక్రవారం పరిస్థితి తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు విద్యాశాఖను సంప్రదించారు. ఆ పాఠశాలను సురక్షితమైన ప్రదేశానికి మార్చాలని కోరారు. విద్యాశాఖ అనుమతితో స్థానిక నివాసి సమకూర్చిన ఇంటికి ఆ పాఠశాలను తాత్కాలికంగా తరలించారు. మరోవైపు సురక్షిత ప్రదేశంలో 18 మంది పిల్లలకు తరగతులు ప్రారంభం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. శాశ్వత పాఠశాల భవన నిర్మాణానికి కూడా తమ వంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు తెలిపారు. దీనిని సీజేపీ ప్రభావంగా అశుతోష్ కొనియాడారు. శిథిలావస్థలో ఉన్న స్కూల్ భవనాన్ని అధికారులు కూల్చివేసినట్లు ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

# నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

మొదటి తరువాయి

హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి విద్యాసంస్థలకు ఉన్న అవకాశాలను కేంబ్రిడ్జ్ బృందానికి వివరించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వం తరఫున సేవలు అందిస్తున్న ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో భాగస్వామ్యం చేసుకునేందుకు ఆసక్తి చూపించారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, పరిశోధన, వ్యాపార ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించడం, కొత్త స్టార్టప్‌లను అభివృద్ధి చేయడం వంటి అంశాల్లో తెలంగాణ, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ కలిసి పనిచేసేందుకు ఒక ప్రత్యేక సహకార వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇరు పక్షాలు ఈ సందర్భంగా అంగీకరించాయి. 'ఫ్రూగల్ ఎఐ' కో–చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి కనబరిచారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు చేపట్టడం, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి. ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గం చూపనున్నాయి.

# భూ భారతితో కాంగ్రెస్ నవ్వులపాలు..

మొదటి తరువాయి

ములను రాత్రికి రాత్రే అక్రమంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ఆస్తులను భద్రంగా ఉంచాలంటే ఆర్మీని దింపాల్సి వస్తుందని హైకోర్టు వ్యాఖ్యానించిందంటే పరిస్థితి తీవ్రత ఎంతగా ఉన్నదో అర్థమవుతున్నదని చెప్పారు. రెండేండ్లలో 22ఏలో చేర్చిన, తొలగించిన భూములపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు, విద్యార్థినులకు స్కూటీలు ఎక్కడ? అని ప్రశ్నించారు.

22ఏ పేరిట దోబూచులాట

నిషేధిత జాబితాలో భూములను ఎవరు చేరుస్తున్నారని అడిగితే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, అధికారులు.. తమకు తెలియదంటూ ఎవరికి వారు దోబూచులాడుతున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 22ఏలో తప్పులు దొర్లాయని మంత్రి క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తప్పించుకోవడం కోసమే తన భూమి సైతం 22ఏలో ఉన్నదని సీఎం బుకాయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం ఆర్‌ఆర్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మారిందని ఎద్దేవా చేశారు.

## నాలుగేళ్లలోపు చిన్నారులకు ఆ మందులు వాడొద్దు..



న్యూఢిల్లీ:

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్లలోపు చిన్నారులకు క్లోర్‌ఫెనిరమైన్ మలేట్ , ఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్ తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై 'ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు' అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) చేసిన సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గతంలో 2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డీసీ మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా.. తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్లలోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావంచూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టంచేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్–1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

# కమిషన్ల కోసం కాళేశ్వరం..

మొదటి తరువాయి

అందించిందని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు నిజామాబాద్ జిల్లాకే మంజూరయ్యాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిన ఇళ్లను తమ ప్రభుత్వం పూర్తి చేసి పేదలకు అందిస్తామన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో 15 నుంచి 20 రోజుల్లో ఇందిరమ్మ టవర్స్ కు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. 400 ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని పాత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని, నిజామాబాద్ జిల్లాలో 10కి పైగా ప్రాంతాల్లో కొత్త కార్యాలయాలకు శంకుస్థాపనలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను కేవలం రూ.230కే అందించేలా సిమెంట్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదన్నారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటి నుంచో కృషి చేస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, సీనియర్ నాయకురాలు కవితారెడ్డి, వివిధ కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


# రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్ బై

**-ప్రైవేట్ రంగానికి కీలక బాధ్యతలు**
**-లాంచ్ వెహికల్స్ తయారీ నుంచి క్రమంగా తప్పుకోనున్న ఇస్రో**
**- ప్రైవేట్ రంగానికి రాకెట్ల తయారీ, ఉత్పత్తి బాధ్యతలు**
**-ఎస్ఎస్ఎల్వీ టెక్నాలజీ, ఉత్పత్తి హక్కులు ఇప్పటికే హెచ్ఏఎల్ కు బదిలీ**
**- తదుపరి దశలో పీఎస్ఎల్వీ, ఎల్వీఎం3 తయారీ**
**- ఇకపై ఇస్రో పరిశోధన, అత్యధునిక సాంకేతికతలపై దృష్టి**

న్యూఢిల్లీ:

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇకపై లాంచ్ వెహికల్స్ తయారీ, సాధారణ శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించనుంది. ఇస్రో పరిశోధన, అత్యధునిక సాంకేతిక అభివృద్ధి, శాస్త్రీయ ప్రయోగాలు, అన్వేషణలపైనే మరింత దృష్టి పెట్టనుంది. బిజినెస్ టుడే నిర్వహించిన ఇండియాఏ100 కాంక్లేవ్ లో ఇన్ స్పేస్ ఛైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు.

"ఇకపై ఇస్రో ఎలాంటి లాంచ్ వెహికల్స్ ను తయారు చేయదు. వాటి తయారీని ప్రైవేట్ రంగా లేదా ప్రభుత్వ రంగ సంస్థలు చేపడతాయి" అని ఆయన తెలిపారు. ఈ మార్పు ఇప్పటికే ప్రారంభమైంది. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ



ద్వారా హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు బదిలీ చేశారు.

120 సాంకేతికతలు ప్రైవేటుకు బదిలీ..

తదుపరి దశలో భారత్ ప్రధాన రాకెట్లైన పీఎస్ఎల్వీ ఎల్వీఎం 3 సాంకేతికత, తయారీ కూడా ప్రైవేట్ రంగానికి బదిలీ చేసే దిశగా చర్చలు సాగుతున్నాయి. అయితే ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లు గోయెంకా తెలిపారు. ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధానంగా పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. కొత్త సాంకేతికతలు, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించనుంది. ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేందుకు సిద్ధమైన తర్వాత దానిని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా చెప్పారు. ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

కొత్త లాంచ్ ప్యాడ్ నిర్వహణ బాధ్యత కూడా..

ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త లాంచ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన అగ్రిమెంట్ ను వచ్చే నాలుగు లేదా ఐదు నెలల్లో ఖరారు చేసే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతం ఉన్న సుమారు 8 బిలియన్ డాలర్ల నుంచి 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వ డిమాండ్, అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాల్లో విస్తృతంగా వినియోగించడం, అంతర్జాతీయ మార్కెట్లో భారత సంస్థల విస్తరణ కీలకమని గోయెంకా చెప్పారు. ప్రభుత్వం ప్రధాన కస్టమర్ గా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ ఇప్పటికే ప్రైవేట్ సంస్థలకు 31 ఉపగ్రహాల తయారీకి ఆర్డర్లు ఇచ్చిందని, ఇది భవిష్యత్ కార్యక్రమాల్లో భాగంగా మరో 21 ఉపగ్రహాలను ఇస్రో తయారు చేయనుందని తెలిపారు.

# దౌత్యనీతి అంటే కేవలం టీ20లు కాదు.. టెస్టులూ ఉంటాయ్

**-అంతర్జాతీయ సమస్యలకు సహనం, దీర్ఘకాలిక దృష్టి అవసరం**
**-పశ్చిమాసియా యుద్ధం టెస్టు సిరీస్‌లా సాగుతోందన్న జైశంకర్**
**-భౌగోళిక రాజకీయ సవాళ్ల మధ్య 'డి-రిస్కింగ్'పై దృష్టి**
**-ఒకే వనరుపై ఆధారపడొద్దు.. ప్రత్యామ్నాయాలు పెంచుకోవాలి**
**-సరఫరా గొలుసు అంతరాయాలకు ముందస్తు ప్రణాళికలు కీలకం**
**-ఇంధనం, ఎరువులు, రవాణాపై ప్రపంచ ఉద్రిక్తతల ప్రభావం**
**-వైవిధ్యం, పెట్టుబడుల భద్రతతో ప్రమాదాలను తగ్గించుకోవచ్చు**




న్యూఢిల్లీ:

: దౌత్యం, భౌగోళిక రాజకీయాలను ఎల్లప్పుడూ త్వరిత ఫలితాల దృష్టితో అంచనా వేయలేమని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. కొన్ని అంతర్జాతీయ సవాళ్లకు సహనం, దీర్ఘకాలిక నిబద్ధత అవసరమని చెప్పారు. 'ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్' ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రస్తుత దౌత్యనీతి 'టీ20 క్రికెట్' ను పోలి ఉందా..? అనే ప్రశ్నకు ఆయన ఈ మేరకు స్పందించారు.అంతర్జాతీయ సంబంధాలు సుదీర్ఘమైన, అనిశ్చిత ప్రక్రియలతో కూడుకున్నవని, భౌగోళిక రాజకీయ సమస్యలకు ప్రభుత్వాలు, మీడియా త్వరితగతిన పరిష్కారాలు కోరుకుంటాయి. కానీ వీటి పరిష్కారం సుదీర్ఘకాలంలో రూపుదిద్దుకుంటుంది. అదే సమయంలో టీ20 మాదిరి మీడియాకు స్వల్పకాలిక పరిణామాలను అందించాల్సిన అవసరం ఉంది. అయితే వాస్తవ ప్రపంచంలో టెస్ట్ మ్యాచ్‌లూ ఉంటాయి. వాటి ఫలితాలు తక్కువ సమయంలో తేలిపోయేవి కావు. పశ్చిమాసియా యుద్ధం ఒక టీ20 మ్యాచ్‌లా ఉంటుందని అంతా భావించారు. కానీ అది ఏకంగా టెస్ట్ సిరీస్, అంతకంటే ఎక్కువకాలం సాగే ప్రక్రియగా మారింది' అని పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు సమస్యలు, మార్కెట్ అంతరాయాలతో కూడిన నేటి అనిశ్చిత ప్రపంచంలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల కోసం జైశంకర్ నాలుగు సూత్రాలను సూచించారు. అంతరాయాల నుంచి తమను తాము కాపాడుకోవడం వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల ప్రాధాన్య అంశంగా ఉండాలని చెప్పారు. 'డి–రిస్కింగ్' తన అతిపెద్ద మంత్రమని పేర్కొన్నారు. ఎక్కువ మంది భాగస్వాములు, అధిక సంఖ్యలో సరఫరా వనరులపై ఆధారపడాలని సూచించారు. ఎన్ని ఎక్కువ ఆప్షన్లు ఉంటే అంత సురక్షితంగా ఉంటారని తెలిపారు.ప్రపంచ మార్కెట్లు తరచూ భౌగోళిక రాజకీయాలవల్ల ప్రభావితమవుతాయనే విషయాన్ని అంగీకరించాలన్నారు. ఇంధనం, ఎరువులు, రవాణా వంటివి దీనికి ఉదాహరణలని తెలిపారు. అంతరాయాలు ఎప్పుడైనా కలగవచ్చని అంచనా వేసి ముందుగానే ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. వైవిధ్యం పాటించి, పెట్టుబడులకు భద్రత కల్పించుకోవాలని చెప్పారు.

# దేశమంతటా వందేమాతరం

**- ప్రచార కార్యక్రమానికి బీజేపీ తీర్మానం**
**-- రెండు చరణాలకే పరిమితమున్న కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తున్నాం**
**-పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వెల్లడి**
**- బీజేపీలో జెన్ జీ కమిటీ ఏర్పాటు**
**- నితిన్ నబీన్ టీంతో ప్రధాని మోడీ భేటీ**



న్యూఢిల్లీ:

భారతీయ జనతా పార్టీ వందే మాతరం గురించి అవగాహన పెంచి దాని వినియోగాన్ని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్త ప్రచారం చేపట్టనుంది. దీనికి సంబంధించి శనివారం న్యూఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన నూతన కార్యాలయ కార్యనిర్వాహకుల సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఆయన తర్వాత ఈ తీర్మానాన్ని సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. సోషల్ మీడియాలో చేసిన పోస్టులో భారతీయ జనతా పార్టీ ఈరోజు ఆగస్టు 22న వందేమాతరం గౌరవం, దాని చారిత్రక వారసత్వ పరిరక్షణకు సంబంధించి ముఖ్యమైన తీర్మానం ఆమోదించిందని నితిన్ నబీన్ తెలిపారు.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 2026, ఆగస్టు 19న 1937 తీర్మానాన్ని పునరుద్ధరిస్తూ, కాంగ్రెస్ కార్యక్రమాల్లో వందేమాతరం మొదటి రెండు చరణాలు మాత్రమే పాడాలని తీసుకున్న నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ గట్టిగా ఖండిస్తూ, స్పష్టంగా వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. వందేమాతరంను భారత జాతీయ గీతంగా, భారతమాత పట్ల గౌరవ వ్యక్తీకరణగా, స్వాతంత్ర్య పోరాట మంత్రంగా, భారత జాతీయ చైతన్య అమర చిహ్నంగా భావిస్తున్నట్లు తెలిపారు. పూర్తి ఆరు చరణాల వందేమాతరం గౌరవం, వారసత్వం జాతీయ స్వభావాన్ని కాపాడుతామని స్పష్టం చేశారు.

రాజకీయ సౌలభ్యం లేదా సంతృప్తి కోసం వందేమాతరం గౌరవం, వారసత్వంపై ఎలాంటి రాజీకి అంగీకరించేది లేదని తెలిపారు. మహాత్మా గాంధీ వందేమాతరంను సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా, అత్యంత పవిత్ర జాతీయ భావనతో ముడిపెట్టిన ప్రకటన ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ముఖ్యంగా యువతకు అవగాహన కలిగిస్తామని తెలిపారు.

1950లో రాజ్యాంగ పరిషత్తు ప్రకటన, 2026లో పార్లమెంట్ చట్టం ద్వారా జాతీయ గీతానికి జనగణమనతో సమానమైన చట్టపరమైన రక్షణ కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. రాజ్యాంగ సంస్థలు లేదా రిపబ్లిక్ ఆఫ్ ఇండియా చట్టాలను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం అధిగమించలేదని, 1937నాటి రాజకీయ రాజీ, 1950నాటి రాజ్యాంగ పరిష్కారం, 2026నాటి పార్లమెంట్ చట్టం కంటే ఎక్కువ కాదని వ్యాఖ్యానించారు.

బీజేపీలో జెన్ జీ కమిటీ

నూతనంగా నియమితులైన పార్టీ నాయకులతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ శనివారం ఇక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జెన్ జీతో సంబంధం పెంచుకోవడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. దేశ యువతను పార్టీ వైపు ఆకర్షించి, వారితో బంధాన్ని బలపేతం చేయడానికి ఏర్పాటు చేసిన ఈ కమిటీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శులు స్మృతి ఇరానీ, వినోద్ తావ్డే, గుజరాత్ మంత్రి హర్ష్ సంఘవి, ఛత్తీస్‌గఢ్ మంత్రి ఉమేష్ చౌదరి సహా ఇతర ప్రముఖ నాయకులు ఉన్నారు.

వచ్చే సెప్టెంబర్ నుంచి యువతతో అధికారికంగా సంభాషణ ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. యువత ఆకాంక్షలు, ఆందోళనలు, అంచనాలను అర్థం చేసుకోవడమే లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుంది. జెన్ జీ బీజేపీ నాయకులతో నేరుగా మాట్లాడి, తమ సమస్యలు, అభిప్రాయాలు పంచుకునే వేదికగా ఇది ఉపయోగపడుతుందని వెల్లడించాయి.

కొత్త టీమ్ బాగుంది

పార్టీని బలోపేతం చేయడం, ప్రజలతో సంబంధాన్ని మరింత లోతుగా చేయడం లక్ష్యంగా కొత్త ఆలోచనలు, దృక్పథాలపైనే సంస్థాగత సమావేశాలు ఉంటాయి. పార్టీ సహచరులు, కొత్త సంస్థాగత బృందంతో అద్భుతమైన సంభాషణ జరిగింది అని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఎక్స్ లో పోస్ట్ చేశారు.

అంతకుముందు ఇక్కడ బీజేపీ ప్రధాన కార్యాలయంలో కొత్తగా పార్టీ పదవుల్లో నియమితులైన వారిని ఆయన కలిశారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం అందరితో కలిసి మోడీ గ్రూప్ ఫోటో దిగారు.

# షహబాజ్ సర్కారుకు బిగుస్తున్న ఉచ్చులు..

**ఉమ్మడిపోరుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు..!**

న్యూఢిల్లీ:

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పై రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది. ఒకవైపు కీలక మిత్రపక్షమైన 'పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (ప్రా)' తో విభేదాలు ముదురుతుండగా.. మరోవైపు ప్రతిపక్షాలు ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతున్నాయి. ఇంకోవైపు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వైద్య చికిత్స వ్యవహారం కూడా షహబాజ్ ప్రభుత్వాన్ని చిక్కుల్లోకి నెడుతోంది.ఆగస్టు 18న ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలు నుంచి రెండు రోజుల్లో ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ ఆసుపత్రికి తరలించాలని పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ప్రభుత్వం ఈ ఉత్తర్వులపై పునర్విచారణ కోరింది. భద్రతా కారణాలతో షిఫాకు బదులుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని పిమ్స్ ఆసుపత్రికి తరలించింది. వైద్య పరీక్షల తర్వాత కొన్ని గంటల్లోనే మళ్లీ జైలుకు పంపింది. దాంతో సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వం పాటించలేదంటూ ఇమ్రాన్ కుటుంబం, పీటీఐ ఆరోపించాయి. అయితే ఈ వ్యవహారం కోర్టు ధిక్కార కేసుకు దారితీసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో పీపీపీ అధినేత బిలావల్ భుట్టో.. జర్దారీ ప్రభుత్వం తీరుపై కఠిన వైఖరి తీసుకున్నారు. తమ అభ్యంతరాలు పరిష్కరించే వరకు సెనేట్, జాతీయ అసెంబ్లీలో ప్రభుత్వ బిల్లులకు మద్దతు ఇవ్వబోమని ప్రకటించారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించిన పీపీపీ.. ఫలితాలను న్యాయస్థానంలో సవాల్ చేయాలని నిర్ణయించింది.

# పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు

మొదటి తరువాయి

డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో కలుపాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సిద్దిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాజ్‌గోపాల్ పేట రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఆ మార్గంలో వెళ్తున్న హరీశ్‌రావు విద్యార్థుల ఆందోళనను గమనించి అకడ ఆగి వారికి సంఘీభావం తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల ఆందోళనకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్య ద్వారా ఎందరో నిరుపేద విద్యార్థులు నాణ్యమైన సాంకేతిక విద్యను అభ్యసించి దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని చెప్పారు. రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సుమారు 95% మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. జీవో 97ను రద్దు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి తాను లేఖ రాశానని, అసెంబ్లీలో కూడా విద్యార్థుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైతే మరింత పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిద్దిపేట ఉమెన్స్ పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్‌తోపాటు తమ విద్యార్థి విభాగం పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ అంశంపై ప్రతి వేదికపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని భరోసా కల్పించారు.

## సంపాదకీయం

# రూపాయి బియ్యంతో దళారుల దందా



ఉచిత రూపాయికే కిలో బియ్యం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పక్కదారి పడుతోంది. బియ్యం స్మార్ట్ కార్డులు అందచేసినా, చాలావరకు బియ్యం అక్రమంగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టన్నుల కొద్ది బియ్యం పోర్టులు దాటిపోయాయి. తెలంగాణలో కూడా అదే విధంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలించి నయాదందా తెరతీసారు. ఎన్టీఆర్ హాయంలో పేదలకు బియ్యం అందించాలని కిలో రెండు రూపాయలకే పథకం తెచ్చారు. అది పలు రూపాంతరాలు చెంది. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉండగా కిలో రూపాయికే అందిస్తున్నారు. దీని ధరలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్నాయి. ఎక్కడ ఓటు బ్యాంక్ పోతుందో అన్న భయంలో పాలకులు ఉన్నారు. పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వాలు రూపాయి ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా బియ్యం ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లబ్ది అక్రమార్కుల పాలిట 'కాసుల పంట'గా మారుతోంది. రూపాయి లేకపోయినా పేదవాడు ఆకలితో అలమటించకూడదని ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుంటే, ఆ పథకం ఆశయం కాస్తా దారి మళ్లుతోంది. ఉచిత బియ్యం అర్హులైన పేదల కడుపు నింపాల్సింది పోయి, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతుండటం తీవ్ర విచారకరం. తినడానికి ఇచ్చే బియ్యం.. గడప దాటక ముందే విక్రయం జరుగుతోంది. వందలకోటల బిసినెస్ దీనివెనక నడుస్తోంది. ఈ రోజుల్లో చాలా చోట్ల రేషన్ కార్డు ఉండి, రేషన్ బియ్యాన్ని ఆహారంగా వాడుకోని వర్గాలు దాన్ని ఒక అదనపు ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నాయి. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే లబ్దిదారుల ఇళ్ల ముందే దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు, కేవలం ఐదు-పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల దందా ఇంకొంచెం ముందుకెళ్లింది. అసలు బియ్యం సంచులను ఇళ్లకు కూడా తీసుకెళ్లడం లేదు. షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి, బియ్యాన్ని అక్కడ వదిలేసి, కిలోకు రూ.10 నుండి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విధంగా మిగిలిపోయిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంకొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా.. బహిరంగ మార్కెట్లో వీటిని కేజీకి రూ.20 నుండి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది. ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేసినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల అధికారులు హెచ్చరించడం షరామామూలుగా మారింది. దీంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపడం లేదు. దీంతో వ్యారం యధావిధిగా సాగుతోంది. చ్చరించారు. లబ్దిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగస్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న ఆహార ధాన్యాలను కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ రాబోయే 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖను నేరుగా ప్రజల చెంతకు చేర్చాలనే తపనతోనే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు తరలించే దుస్థితి ఉండేదని, దానిని మారుస్తూ దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది పేదలు లబ్ది పొందుతున్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందక ఇబ్బంది పడిన వారికి ఉపశమనం కలిగిస్తూ.. ప్రభుత్వం కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత అందుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కూడా ఈ కార్డులు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వాలు కఠిన చర్యలు తసీఉకోనంత వరకు ఈ దందా ఆగదు. అక్రమంగా తరలింపు కూడా ఆతదని పాలకులు గుర్తించాలి.

# అభివృద్ధి ప్రదాత శ్రీధర్‌బాబును విమర్శించే అర్హత మధుకు లేదు


**-మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్**



**రామగిరి, ఆగస్టు 22 (మహాప్రభ)**
రాష్ట్ర మంత్రి,మంథని ఎమ్మెల్యే,దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ నేత,మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి."మతిభ్రమించి వెర్రిలేసిన కుక్కలా మా నాయకుడిపై నోరు పారేసుకుంటే నాలుక కోస్తాం..రాబోయే రోజుల్లో ప్రజలు తరిమితరిమి కొడతారు" అంటూ మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్‌రోడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పుట్ట మధు వ్యాఖ్యలపై తొట్ల తిరుపతి యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.సీబీఐ భయంతోనే ఫ్రస్ట్రేషన్‌లో మాట్లాడుతున్నాడు,గట్టు వామన్‌రావు దంపతుల హత్యకేసుకు సంబంధించి సీబీఐ విచారణకు హాజరైన పుట్ట మధు కంగుతిన్నారని,తన రాజకీయ ఉనికి కోల్పోతాననే ఫ్రస్ట్రేషన్‌లోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని తొట్ల తిరుపతి యాదవ్ ఆరోపించారు.వందల కోట్ల రూపాయల నిధులతో శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే,ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే పుట్ట మధు మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మాఫియా చరిత్ర నీది.. అభివృద్ధి లక్ష్యం మాది!నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా రోజుకు 20 గంటలు శ్రమిస్తూ,పరిశ్రమలు, పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే స్థాయి, అర్హత పుట్ట మధుకు లేదని తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం శ్రీధర్‌బాబు పనితీరును మెచ్చుకుంటుంటే,దానిని జీర్ణించుకోలేక పుట్ట మధు అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు.గతంలో ఒక్కసారి అధికారం ఇస్తే మంథని ప్రాంతాన్ని ఇసుక,మట్టి మాఫియాలకు అడ్డాగా మార్చి, హత్యలు,అలజడులతో ప్రాంతాన్ని అల్లకల్లోలం చేసిన ఘనత పుట్ట మధుదేనని తొట్ల తిరుపతి యాదవ్ ఆరోపించారు.మర్యాద దక్కదు...పద్ధతి మార్చుకోవాలి! 40 ఏళ్లుగా కాంగ్రెస్ కుటుంబాన్ని మంథని ప్రజలు ఎందుకు ఆదరిస్తున్నారో పుట్ట మధు ఆత్మవిమర్శ చేసుకోవాలని తొట్ల తిరుపతి యాదవ్ సూచించారు.శ్రీపాదరావు,శ్రీధర్‌బాబు కుటుంబానికి మంథని ప్రజలు పదేపదే ఎందుకు పట్టం కడుతున్నారో ప్రజల తీర్పే సమాధానమని అన్నారు.ఇకనైనా పద్ధతి మార్చుకుని నోరు అదుపులో పెట్టుకోవాలని,లేదంటే పుట్ట మధు వ్యాఖ్యలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.మాజీ ఎమ్మెల్యే,మాజీ జెడ్పీ చైర్మన్ అనే గౌరవ పదవులను కించపరిచేలా మాట్లాడటం మానుకోవాలని సూచించారు.మంథని నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, శ్రీధర్‌బాబు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని కాంగ్రెస్ శ్రేణులంతా ఆయన వెంటే నడుస్తారని తొట్ల తిరుపతి యాదవ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉప అధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి,మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్,రామగిరి మండల బీసీ సెల్ అధ్యక్షులు బండారి సదానందం, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం,రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్,సుంద్ధిల్ల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ సత్యనారాయణ గౌడ్,పన్నూర్ సర్పంచ్ చిందం,మహేష్, నవాబ్ పేట సర్పంచ్ రొడ్డ మౌనిక కుమార్,ఆదివారం పేట సర్పంచ్ ఇల్లందుల సంజీవ్,నాగ పల్లి సర్పంచ్ కొండవేణ దివ్య సుధాకర్,కాలేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం మాజీ సర్పంచ్ లు తీగల సమ్మయ్య ఎరుకల బాబురావు,పెద్దపల్లి జిల్లా యూత్ నాయకుడు గొర్రె నరేష్ యాదవ్, పెద్దపల్లి జిల్లా యూత్ నాయకుడు మట్ట రాజు,పన్నూర్ ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు జాగరి రజిత, విజయ,రత్నాపూర్ కాంగ్రెస్ నాయకులు,బర్ల శ్రీకాంత్,గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ఉప సర్పంచ్ నరేష్ యాదవ్, స్టాలిన్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# భూ వివాదంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

**తహసీల్దార్ కార్యాలయంలో కులం పేరుతో అవమానించారని ఆరోపణ.. ఏసీపీకి ఫిర్యాదు**



**జైపూర్, ఆగస్టు 22 (మహాప్రభ)**
జైపూర్ మండలం గంగిపల్లికి చెందిన ఎనగందుల భూమక్క, నర్సయ్య కుటుంబం.తమ కుటుంబం ఏళ్లుగా కాస్తులో ఉన్న ఐదు ఎకరాల లావణి పట్టా భూమి తమకు తెలియకుండానే ఇతరుల పేరుపైకి మారిందని ఆరోపిస్తూ గంగిపల్లికి చెందిన ఎనగందుల భూమక్క, నర్సయ్య కుటుంబం న్యాయం కోసం అధికారులను ఆశ్రయించింది. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యను వివరించగా, కులం పేరుతో దూషించి అవమానించడంతోపాటు సిబ్బందితో బయటకు పంపించారని ఆరోపిస్తూ జైపూర్ ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.
బాధితుల వివరాల ప్రకారం.. జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 102/ఎ1లోని 5 ఎకరాల లావణి పట్టా భూమి 2008 నుంచి తమ కుటుంబం కాస్తులో ఉందని పేర్కొన్నారు. అయితే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భూమి రికార్డులను ఇతరుల పేరుపైకి మార్చినట్లు ఇటీవల గుర్తించామని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులను కలిసి రికార్డులను పరిశీలించి, వాస్తవాలను వెలుగులోకి తీసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు చెప్పారు.కులం పేరుతో దూషించారని ఆరోపణ. భూ సమస్యపై తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ గోడును వివరించే ప్రయత్నం చేయగా, తహసీల్దార్ కులం పేరుతో దూషించి అవమానకరంగా మాట్లాడారని, అనంతరం సిబ్బందితో తమను కార్యాలయం నుంచి బయటకు పంపించారని బాధిత కుటుంబం ఆరోపించింది. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురయ్యామని పేర్కొంది. న్యాయం కోసం అధికారులను ఆశ్రయించిన తమ పట్ల ఇలా వ్యవహరించడం బాధాకరమని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీపీని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా సర్వే నంబర్ 102/ఎ1లోని భూమికి సంబంధించిన పాత, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి, 2008 నుంచి తమ కాస్తులో ఉన్న భూమి ఇతరుల పేరుపైకి ఎలా మారిందనే అంశంపై విచారణ జరిపించాలని కోరింది. తమ హక్కులు నిర్ధారణ అయితే భూమిపై న్యాయపరమైన హక్కును కాపాడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. భూ వివాదంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, కులం పేరుతో దూషించారన్న తమ ఆరోపణపైనా సమగ్ర విచారణ చేపట్టి, తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఎనగందుల భూమక్క, నర్సయ్య కోరారు.

## శ్రావణ శనివారం సందర్భంగా మన్యంకొండలో వైభవంగా వెంకటేశ్వర స్వామి సేవలు

**భక్తిశ్రద్ధలతో శేష వాహన సేవ, కుంకుమార్చన, హోమం, అభిషేకం**





**మన్యంకొండ: ఆగస్టు 22 దేవరకద్ర మహాప్రభ**
తెలంగాణ తిరుపతిగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పేదల తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శ్రావణ శనివారం పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి శేష వాహన సేవ, కుంకుమార్చన, హనుమద్దాసు సంకీర్తనలు, హోమం, ప్రత్యేక అభిషేకం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణలతో మన్యంకొండ క్షేత్రం భక్తి పారవశ్యంతో మార్మోగింది. స్వామివారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు పొందారు. శ్రావణమాసంలో స్వామివారిని దర్శించుకోవడం, ప్రత్యేక సేవల్లో పాల్గొనడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. ఈ కార్యక్రమాలు దేవస్థానం చైర్మన్ అలహరి మధుసూదన్ ఆధ్వర్యంలో, దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. దేవస్థానం సిబ్బంది, అర్చకులు, భక్తులు కార్యక్రమాలను విజయవంతం చేయడంలో సహకరించారు. "శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య అనుగ్రహం ప్రతి భక్తుని ఇంటా ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం నింపాలని" ఈ సందర్భంగా భక్తులు ప్రార్థించారు.

## 22-ఎ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలి

**-తూప్రాన్ ఆర్డీఓ కు వినతిపత్రం అందించిన బిజెపి నేతలు**




**తూప్రాన్, ఆగస్టు 22 (మహాప్రభ)**
రైతుల భూములను 22-ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించి, అర్హులైన రైతులకు భూమిపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతల ఆధ్వర్యంలో శనివారం తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయం లో వినతి పత్రాన్ని ఆర్డిఓ బావయ్యకు సమర్పించారు. 22-ఎ నిషేధిత జాబితాలో ఉన్న అర్హత కలిగిన రైతుల భూములను జాబితా నుంచి తొలగించి, రైతులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రటరీ నత్తి మల్లేశ్, ముత్తురాజు మాట్లాడుతూ, 22-ఎ నిషేధిత జాబితా కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది రైతులు తమ భూములకు సంబంధించిన హక్కులను అనుభవించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే దీని తొలగించాలన్నారు. అర్హత కలిగిన రైతుల భూములను 22-ఎ జాబితా నుంచి తొలగించి వారికి పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు బీజేపీ తరపున పోరాటం కొనసాగిస్తామని మున్సిపల్ అధ్యక్షులు భూమన్న గారి జానకిరామ్ గౌడ్ పేర్కొంటూ 22-ఎ నిబంధనల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. తద్వారా ప్రభుత్వ ఉన్నత అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, రైతుల హక్కుల పరిరక్షణ కోసం 22-ఎ నిషేధిత జాబితా సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు. ఇందులో తూప్రాన్ మండల బిజెపి అధ్యక్షులు పిట్ల పోచయ్య, జనరల్ సెక్రెటరీ సంపత్, రాజు, కిసాన్ మోర్చా సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# చేరుపల్లి రామాంజమ్మ మృతి బాధాకరం


- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ ఆగస్టు 22 ( మహాప్రభ)**
దేవరకొండ పట్టణానికి చెందిన చేరుపల్లి రామాంజమ్మ మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శనివారం దేవరకొండ పట్టణంలోని 10వ వార్డులో నిర్వహించిన చేరుపల్లి రామాంజమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.రామాంజమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు , మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్ గౌడ్ , కౌన్సిలర్ ముత్యాల రవికుమార్ యాదవ్ అన్న, నీల రవి పులిపాటి సన్నీ అన్నగారు, దస్రు, సర్పంచ్ బషీర్, నిరంజన్ గారు, చేరుపల్లి బాలరాజు నల్లగా సత్యనారాయణ గారు, వనం జగదీశ్వర్ వలసాని వెంకన్న,గుండాల వెంకట్ యాదవ్, సైదులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో నేడు 4 గంటల పాటు పవర్ కట్

-విద్యుత్ వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారుల సూచన




**ఎల్లారెడ్డి, ఆగస్టు 23, (మహాప్రభ):** ఎల్లారెడ్డి పట్టణంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం (ఆగస్టు 23) విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వెంకటస్వామి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మొత్తం నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. సబ్‌స్టేషన్‌లో చేపట్టనున్న నిర్వహణ పనుల దృష్ట్యా ఈ అంతరాయం తప్పదని అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని, తాగునీరు, ఇతర విద్యుత్ ఆధారిత అవసరాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఏఈ తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

# కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యునిగా పి. శ్రీనివాస్ రెడ్డి నియామకం.



**తూప్రాన్, ఆగస్ట్ 22 (మహాప్రభ)** సిద్దిపేట జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యునిగా నియమితులైన తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి పట్లోరి శ్రీనివాస్ రెడ్డి కి హృదయ శు భాకాంక్షలను తెలిపిన బిజెపి నేతలు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాకిచ్చిన ఈ పదవి నా సొంత పనికి కాకుండా పార్టీ కోసం శక్తివంచన లేకుండా అహర్నిశలు కృషి చేస్తానని తూప్రాన్ మండలం అధ్యక్షులు పిట్ల పోచయ్యతో కలిసి పార్టీకి పనిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇందులో జిల్లా జనరల్ సెక్రటరీ నత్తి మల్లేష్ ముదిరాజ్, తూప్రాన్ రూరల్ అధ్యక్షులు పిట్ల పోచయ్య, మున్సిపల్ అధ్యక్షులు జానకి రామ్ గౌడ్, శక్తికేంద్రం ఇంచార్జ్ కుంట రాజు, జనరల్ సెక్రటరీ సందీప్, మనోహరాబాద్ జనరల్ సెక్రటరీ మల్లేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు నీరుడి యాదగిరి, తదితరులు ఉన్నారు.

# ఎల్ నినో ప్రభావంతో వరికి బ్రేక్..

- ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన



**చింతపల్లి, ఆగస్ట్ 22 (మహాప్రభ)** ఎల్ నినో వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల, రానున్న రోజుల్లో విద్యుత్ కోతలను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి నాట్లు వేయకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఏ. నరసింహ సూచించారు. చింతపల్లి మండలం కుర్మేడు క్లస్టర్ పరిధిలోని మోదుగుల మల్లేపల్లి గ్రామంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముద్దం మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. అధిక నీరు, విద్యుత్ అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడిపై దృష్టి సారించాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# సర్ 2వ" విడత ప్రక్రియపై ఓటర్లు అవగాహనతో సహకరించాలి..





-ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ ఆగస్టు 22 ( మహాప్రభ )**
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ( సర్)-2026 రెండో విడత ప్రక్రియపై దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని బూత్ లెవెల్ ఏజెంట్లు ( బి ఎల్ ఏ లు ), కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓ లు) ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను అందించారని తెలిపారు. సర్ కు ముందు దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,69,098 మంది ఓటర్లులి ఉండగా, ఆగస్టు 17న ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో 2,32,283 మంది ఓటర్లులి ఉన్నారని చెప్పారు. మొత్తం 36,815 మంది ఓటర్లనులి వివిధ కారణాలతో తొలగించినట్లు తెలిపారు.
తొలగించిన ఓటర్లలో 7,451 మంది మరణించినవారు, 7,629 మంది డూప్లికేట్ ఓటర్లు, 395 మంది ఆయా చిరునామాల్లో లేనివారులి ఉన్నారని, మరో 21,313 మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు గుర్తించినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇప్పటికే తాజా ఓటరు జాబితాలను రెవెన్యూ అధికారులు బి ఎల్ ఓ లకు రెండు సెట్లుగా అందించారని, అందులో ఒక సెట్ బి ఎల్ ఓ వద్ద, మరో సెట్ ప్రజల పరిశీలన కోసం గ్రామాల్లో అందుబాటులో ఉంచారని తెలిపారు. ప్రజలు తమ పేర్లు, వివరాలను పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలు లేదా మార్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.
ప్రస్తుత ఓటరు జాబితాలో 51,427 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో 4,784 మంది నో మ్యాపింగ్ 46,643 మంది లాజికల్ ఎర్రర్స్ కింద ఉన్నారని పేర్కొన్నారు. వీరికి సంబంధించి ఆగస్టు 27, 2026 నుంచి సెప్టెంబర్ 27, 2026 వరకు ఆయా గ్రామాల్లోనే గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తారని చెప్పారు. నోటీసులు అందడంలో ఏదైనా ఇబ్బంది ఏర్పడినా, విచారణకు సంబంధించిన సమాచారం ఉన్న ప్రతి ఓటరు నిర్ణీత తేదీన తప్పనిసరిగా హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల డాక్యుమెంట్లలో అందుబాటులో ఉన్న ఆధారాలనులి దీూాలు, ఎమ్మార్వో లకు సమర్పించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు.
18 సంవత్సరాలు నిండినప్పటికీ ఓటరు జాబితాలో పేరు లేని వారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు మీ-సేవ ద్వారా ఫారం-6లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు సెప్టెంబర్ 16, 2026 వరకు అవకాశం ఉందని, వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి తుది ఓటరు జాబితాలో అర్హులైన వారిని నమోదు చేస్తారని చెప్పారు. తుది ఓటరు జాబితా అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు తెలిపారు. 2002 ఓటరు జాబితాతో ప్రస్తుతం ఉన్న 2025 ఓటరు జాబితాలో తేడాలు ఉన్న సందర్భాల్లోనే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు అధికారులు, పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఓటర్లకు సేవలు మరింత సులభంగా అందించేందుకు మున్సిపల్ కమిషనర్‌ను అదనపు ఏఈఆర్వో గా నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో గతంతో పోలిస్తే అదనంగా 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 338కు చేరిందని వెల్లడించారు.
సర్ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ పిలుపునిచ్చారు. ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, సర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, పట్టణ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు, కార్యదర్శులు, దేవరకొండ నియోజకవర్గం అన్ని మండలాధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా



**తాడ్వాయి,ఆగస్టు22(మహాప్రభ)**
తాడ్వాయి మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో రాజా బహదూర్ వెంకట రామారెడ్డి 157వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా బహదూర్ వెంకట రామారెడ్డి చిత్రపటానికి మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు పొద్దుటూరి నవీన్‌రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మండల రెడ్డి సంఘం కార్యదర్శి పుల్లం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతి, విద్యావ్యాప్తి, సామాజిక సేవ కోసం రాజా బహదూర్ వెంకట రామారెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. రెడ్డి కులస్తులకు మాత్రమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆయన మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగాలని సూచించారు. రెడ్డి సంఘం క్యాషియర్ దేమే రాజిరెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర తొలి తెలుగు కొత్వాల్‌గా రాజా బహదూర్ వెంకట రామారెడ్డి సుదీర్ఘకాలం విశేష సేవలందించారని తెలిపారు. 1869 ఆగస్టు 22న జన్మించిన ఆయన విద్యావ్యాప్తి, సామాజిక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. రెడ్డి హాస్టల్ స్థాపనతో పాటు వెనుకబడిన వర్గాలు, మహిళల విద్యాభివృద్ధికి పాఠశాలలు, వసతి గృహాల ఏర్పాటుకు కృషి చేశారని వివరించారు. ఆయన సేవలను గుర్తించిన నాటి నిజాం ప్రభుత్వం 'రాజా బహదూర్' బిరుదుతో సత్కరించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏనుగు మోహన్‌రెడ్డి, జిల్లా రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి కందడి ప్రవీణ్‌రెడ్డి, మండల కార్యదర్శి పుల్లం రవీందర్‌రెడ్డి, క్యాషియర్ దేమే రాజిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఏనుగు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, సంఘ సభ్యులు నిమ్మల రాజు, సుధాకర్‌రెడ్డి, సిద్ధిరామరెడ్డి, రాజిరెడ్డి, నారాయణరెడ్డి, చిన్న గంగారెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన రెడ్డి సంఘ సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

-- ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు

--పద్మాజివాడిలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్‌పై అవగాహన





**కామారెడ్డి,ఆగస్టు22(మహాప్రభ)**
సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై శనివారం సదాశివనగర్ మండలం పద్మాజివాడి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు మాయమాటలతో వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ తదితర వివరాలను సేకరించి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బును నిలిపివేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి**
రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు.

**డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి**
యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని శ్రీనివాసరావు సూచించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి అలవాట్లను అలవర్చుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. గ్రామాల్లో జరిగే పండుగలు, వేడుకలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో సోదరభావంతో నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ బి.సంతోష్‌కుమార్, ఎస్సై ఎం.పుష్పరాజ్, సర్పంచ్ లోకోటి సుబ్బారావు, ఉపసర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, సైబర్ క్రైమ్ వారియర్ సంజయ్‌కుమార్, వార్డు సభ్యులు, వీడీసీ పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఘనంగా కలం యోధుడు షయాద్ సోయాబుల్లాఖాన్ 78వ వర్ధంతి వేడుకలు

**-టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843 వ్యవస్థాపకులు మామిడి సోమయ్య యూనియన్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ, కార్యదర్శి అర్వపల్లి నగేష్**

**-అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్**



**ఖమ్మం,22 ఆగస్టు,(మహాప్రభ)**
నిరంకుశత్వంపై అక్షరాన్నే ఆయుధంగా మలిచి, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని, ప్రజాస్వామ్య పాలన రావాలని కోరుతూ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ధీర జర్నలిస్టుగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. షోయబుల్లా ఖాన్ 1920 అక్టోబర్ 17న ఖమ్మం జిల్లాలోని సుబ్లేడు గ్రామంలో హబీబుల్లా ఖాన్, లాయహున్నిసా బేగం దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి హబీబుల్లా ఖాన్ రైల్వే శాఖ లో పనిచేసేవారు. మహాత్మాగాంధీకి ఆయన వీరాభిమాని. గాంధీజీ పట్ల ఉన్న అభిమానంతో తన కుమారుడిని ప్రేమగా 'షోయబుల్లా గాంధీ' అని పిలిచేవారని చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి.
బాల్యం నుంచే షోయబుల్లా ఖాన్ కు సమాజం పట్ల అవగాహన పెరిగింది. బొంబాయిలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఆయన హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీ.ఏ తో పాటు జర్నలిజం విద్యను అభ్యసించారు. మంచి ఉద్యోగం పొందే అవకాశాలు ఉన్నప్పటికీ నిరంకుశ పాలనను ప్రశ్నించేందుకు జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకున్నారు.
జాతీయ భావాలను ప్రోత్సహిస్తున్న 'తేజ్' ఉర్దూ వారపత్రికలో సబ్‌ఎడిటర్‌గా చేరిన షోయబుల్లా ఖాన్ నిజాం పాలకులు, వారి అనుచరులైన భూస్వాములు, రజాకారులు ప్రజలపై సాగిస్తున్న దురాగతాలను తన రచనల ద్వారా ఎండగట్టారు. ఆయన రచనలు నిజాం పాలకులకు ఆగ్రహం తెప్పించడంతో 'తేజ్' పత్రిక నిషేధానికి గురైంది.
ఆ తర్వాత మందుముల నరసింగరావు ఆధ్వర్యంలో నడిచిన 'రయ్యత్' ఉర్దూ పత్రికలో చేరి తన కలానికి మరింత పదును పెట్టారు. బెదిరింపు లేఖలు వచ్చినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. చివరకు 'రయ్యత్' పత్రిక కూడా నిజాం ప్రభుత్వ ఆగ్రహానికి గురై మూతపడింది. అయినప్పటికీ ప్రజల తరఫున తన పోరాటాన్ని కొనసాగించాలని షోయబుల్లా ఖాన్ నిర్ణయించుకున్నారు.

**'ఇమ్రోజ్' పత్రిక స్థాపన.**
స్వయంగా జాతీయ భావాలతో కూడిన పత్రికను ప్రారంభించాలని నిర్ణయించుకున్న, షోయబుల్లా ఖాన్ తన తల్లి, భార్య నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో, బూర్గుల రామకృష్ణారావు ఇంటిని అద్దెకు తీసుకుని 'ఇమ్రోజ్' అనే ఉర్దూ దినపత్రికను ప్రారంభించారు. 1947 నవంబర్ 15న 'ఇమ్రోజ్' తొలి సంచిక వెలువడింది.
ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పత్రికను ప్రజల గొంతుకగా తీర్చిదిద్దారు. నిజాం నిరంకుశత్వం, రజాకారుల మతదురహంకారం, ప్రజలపై జరుగుతున్న దాడులను ఆయన తన సంపాదకీయాలు, కథనాల ద్వారా తీవ్రంగా విమర్శించారు.
దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి నిజాం నిరాకరించాడు. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని




షోయబుల్లా ఖాన్ 'ఇమ్రోజ్' ద్వారా బలంగా డిమాండ్ చేశారు.
జాతీయ ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం కావాల్సిన అవసరాన్ని వివరిస్తూ, ఆయన అనేక సంపాదకీయాలు రాశారు. హైదరాబాద్ ప్రజల్లో ఎక్కువమంది ఉర్దూ చదువుకున్నవారు కావడంతో 'ఇమ్రోజ్' రచనలు ప్రజలు, మేధావులపై గణనీయమైన ప్రభావం చూపాయి. 1948 జనవరి 29న 'ఇమ్రోజ్'లో ప్రచురించిన 'పగటి ప్రభుత్వం--రాత్రి ప్రభుత్వం' అనే సంపాదకీయం షోయబుల్లా ఖాన్ ధైర్యసాహసాలకు నిదర్శనంగా నిలిచింది. ఆయన రచనలు నిజాం ప్రభుత్వానికి, రజాకారులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి.

**ఖాసిం రజ్వీ బెదిరింపులు.**
షోయబుల్లా ఖాన్ పై రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ నుంచి బెదిరింపులు వచ్చాయి. అయినప్పటికీ ఆయన తన రచనా పోరాటాన్ని ఆపలేదు. అన్యాయం ఎక్కడ జరిగినా అక్కడికి వెళ్లి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. 1948 ఆగస్టు 19న నిజాం వ్యతిరేకంగా వార్తలు, వ్యాసాలు రాస్తే చేతులు నరికేస్తామని, ఖాసిం రజ్వీ బహిరంగంగా హెచ్చరించినట్లు, చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. అయితే షోయబుల్లా ఖాన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. సత్యం కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోవడం కూడా గర్వించదగ్గ విషయమేనని ఆయన ధైర్యంగా ప్రకటించారు.

**ఆగస్టు 21 అర్ధరాత్రి దారుణ దాడి.**
1948 ఆగస్టు 21 అర్ధరాత్రి కాచిగూడ ప్రాంతంలోని 'ఇమ్రోజ్' కార్యాలయంలో పని ముగించుకుని షోయబుల్లా ఖాన్ తన బావమరిది ఇస్మాయిల్ ఖాన్‌తో కలిసి ఇంటికి బయలుదేరారు.
చప్పల్ బజార్ ప్రాంతానికి చేరుకున్న సమయంలో సాయుధ దుండగులు వారిపై దాడి చేశారు. షోయబుల్లా ఖాన్‌పై కాల్పులు జరిపి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం ఆయన చేతులను దారుణంగా నరికారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆయన బావమరిది ఇస్మాయిల్ ఖాన్ కూడా తీవ్రంగా గాయపడ్డారు.
కాల్పుల శబ్దాలు విని స్థానిక ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న షోయబుల్లా ఖాన్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

**దేశం కోసం మరణిస్తున్నానని గర్వంగా చెప్పిన షోయబుల్లా.**
ఆగస్టు 22 తెల్లవారుజామున షోయబుల్లా ఖాన్ స్పృహలోకి వచ్చారు. తన చివరి క్షణాల్లో కూడా ఆయన ధైర్యాన్ని కోల్పోలేదు. మరణం అనివార్యమని, మంచి లక్ష్యం కోసం ప్రాణాలు అర్పించడం గర్వించదగ్గ విషయమని తన తల్లిదండ్రులకు, భార్యకు ధైర్యం చెప్పినట్లు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. నిజాం నిరంకుశత్వాన్ని తన కలంతో సవాలు చేసిన షోయబుల్లా ఖాన్ 28 ఏళ్ల వయసులోనే 1948 ఆగస్టు 22న తుదిశ్వాస విడిచారు. షోయబుల్లా ఖాన్ తన మతానికి చెందిన నిజాం పాలకుడే అయినప్పటికీ నిరంకుశ పాలనను సమర్థించలేదు. రజాకారులు తన మతస్తులే అయినప్పటికీ వారి దారుణాలను ఖండించడంలో వెనుకాడలేదు. మతం పేరుతో జరిగే మతోన్మాదాన్ని ఆయన వ్యతిరేకించారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని, మతమౌఢ్యం లేని ప్రజాస్వామ్య పాలన ఏర్పడాలని ఆయన కలలు కన్నారు. ఆ లక్ష్యం కోసం నడిరోడ్డుపైనే తన ప్రాణాలను త్యాగం చేశారు. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక విలువలు, లౌకిక భావాలు, ప్రజల హక్కుల కోసం తన కలాన్ని ఆయుధంగా మార్చుకున్న షోయబుల్లా ఖాన్ త్యాగం నేటి జర్నలిస్టులకు, ప్రజాస్వామ్యవాదులకు స్ఫూర్తిదాయకం. ఆగస్టు 22న ఆయన వర్ధంతి సందర్భంగా ఈ అసమాన కలం యోధుడి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. షోయబుల్లా ఖాన్ అమరత్వం ప్రజాస్వామ్య పోరాటానికి చిరస్మరణీయం. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843 కోశాధికారి వేములకొండ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎలుగోటి వెంకట్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్లా రాకేష్ రెడ్డి, టీబీజేఏ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, కార్యదర్శి కప్పల మధు గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కిరణ్ కుమార్, గుజ్జు గోపాలకృష్ణ, చిన్నంశెట్టి రాంబాబు, పాగా యోనా, మేకల రవి, మొగిలి నాగేశ్వరరావు, షేక్ మీరా, ఎలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమపై రైతులకు అవగాహన కల్పించండి.


రైతు సర్వన్


పట్టు పరిశ్రమల సహాయ అధికారి లింగం

**మెదక్ జిల్లా -23ఆగస్టు(మహాప్రభ )**
కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు సబ్సిడీలు ఇస్తున్నప్పటికీ అధికారుల అవగాహన లోపంతో పట్టు పరిశ్రమపై పట్టు కోల్పోతుంది.దీనితో పట్టు పురుగుల పెంపకం రోజు రోజుకు అడుగంటి పోతుందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తే రైతులు ఎక్కువగా లాభాలు గడించవచ్చని రైతులు కోరుతున్నారు.పట్టు పురుగుల పెంపకానికి, మల్బరీ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నప్పటికీ అవగాహన రాహిత్యంతో అవి లబ్ది దారులకు దరి చేరటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతులకు సబ్సిడీలు అందిస్తూ, అవగాహన కల్పించాలని కోరుతున్నారు.ఎస్సీ,ఎస్టీలకు అదికంగా సబ్సిడీలు అసిస్టెంట్ డైరెక్టర్ లింగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మల్బరీ పరిశ్రమ స్థాపించడం కోసం ఎస్సీ,ఎస్టీలకు అదికంగా సబ్సిడీలు మంజూరు చేస్తున్నట్లు సేరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ లింగం తెలిపారు.రైతులు మల్బరీ పంటలపై దృష్టి సారించాలి రైతులు మల్బరీ పంటలపై దృష్టి సారించాలని మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని జయరాం తండా రైతు లంబాడి సర్వాన్ పేర్కొన్నారు. శనివారం రోజు ఆయన పట్ట పురుగుల సాగు పంటను,షెడ్ ను "ప్రజా లక్ష్యం"ప్రతినిధి సంప్రదించి మాట్లాడారు. రైతులు ఆరుతడి పంటలు,ఎల్ నినో ప్రభావం వరి పంటలపై ప్రభావం చూపుతున్నందున మల్బరీ సాగుపై దృష్టి కేంద్రీకరించాలని,దీనితో అనేక లాభాలున్నాయని ఆయన పేర్కొన్నారు. దేవి సింగ్ గిరిజన తండా రైతు రైతులు ఎక్కువగా మల్బరీ సాగు పై దృష్టి సారించాలని దీనితో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలున్నాయని గిరిజన తండాకు చెందిన రైతు లంబాడి దేవి సింగ్ పేర్కొన్నారు.

# సీపీఆర్ శిక్షణతో ప్రాణాలు కాపాడాలి.

**-అత్యవసర సమయాల్లో సీపీఆర్ ఎంతో కీలకం.**


**-ప్రతి పోలీసు సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి.**

**-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్.**



**మెదక్ జిల్లా,-22ఆగస్ట్ (మహాప్రభ**
అత్యవసర పరిస్థితుల్లో అందించే సీపీఆర్ శిక్షణను సద్వినియోగం చేసుకుని విలువైన ప్రాణాలను కాపాడాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీసులు నిత్యం ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తారని, ప్రమాదాలు, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సంఘటనా స్థలానికి ముందుగా చేరుకునే అవకాశం పోలీసులకే ఎక్కువగా ఉంటుందని తెలిపారు. యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ నిర్వహించారు. అత్యవసర సమయంలో సీపీఆర్‌ను ఎప్పుడు, ఎలా చేయాలనే అంశాలను వైద్య నిపుణులు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. సీపీఆర్ చేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా వివరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గుండెపోటు లేదా ఇతర కారణాలతో వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడినప్పుడు ఆస్పత్రికి తరలించేలోపు సీపీఆర్ అందించడం ఎంతో కీలకమన్నారు. సకాలంలో సరైన విధంగా సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు.సీపీఆర్ ఎప్పుడు, ఎక్కడ అవసరం వస్తుందో చెప్పలేమని.. అందుకే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తప్పనిసరిగా సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించి బాధితుడికి అవసరమైన ప్రాథమిక ప్రాణరక్షణ చర్యలు చేపట్టేలా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు.పోలీసులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రజలకు కూడా సీపీఆర్ ప్రాముఖ్యతను తెలియజేయాలని ఎస్పీ కోరారు. ఒక వ్యక్తి ప్రాణాపాయంలో ఉన్నప్పుడు సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడగలిగితే అంతకంటే గొప్ప సేవ మరొకటి ఉండదన్నారు. ఈ శిక్షణను కేవలం కార్యక్రమానికే పరిమితం చేయకుండా, అవసరమైన సమయంలో ఆచరణలో పెట్టాలని సూచించారు.కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, యూత్ ఫర్ సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆటోల బంద్‌కు జీపు కమాండర్ యూనియన్ సంపూర్ణ మద్దతు



**దేవరకద్ర, ఆగస్టు 22: మహా ప్రభ**
రాష్ట్రవ్యాప్తంగా ఆటో యూనియన్లు ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి 24వ తేదీ వరకు చేపట్టనున్న బంద్‌కు దేవరకద్ర శ్రీ వీరగురు ఆటో యూనియన్ ఆధ్వర్యంలోని జీపు కమాండర్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శనివారం దేవరకద్రలో జీపు కమాండర్ అసోసియేషన్ దేవరకద్ర--మరికల్ అధ్యక్షులు జావిద్, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మహబూబ్‌నగర్ జిల్లా ఆటో యూనియన్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కే. రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు చేపడుతున్న బంద్‌కు జీపు కమాండర్ యూనియన్ సంపూర్ణంగా సహకరిస్తుందని తెలిపారు. ఆటో, జీపు కమాండర్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.
ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, భవాని, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. దేవరకద్ర ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట్ల రామకృష్ణ తదితరులు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మెదక్ డివిజన్‌లో యూరియా సరిపడా నిల్వాలు.

**-ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా రైతులకు సులభతరంగా ఎరువుల బుకింగ్.**

**మెదక్ జిల్లా -22ఆగస్ట్ (మహాప్రభ).**
మెదక్ డివిజన్ పరిధిలోని మెదక్, పాపన్నపేట, హవేలీ ఘనపూర్, శంకరంపేట మండలాల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా ఎరువులు సరిపడా అందుబాటులో ఉన్నాయని మెదక్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఎ డి ఎ )అమీనా బి తెలిపారు. ప్రస్తుతం పంటల సాగు దశలో యూరియా అవసరం పెరుగుతున్న నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, సంబంధిత మండలాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు (ఫ్రెమ్ వర్క్ ఫర్ ఫార్టిలైజర్ సేల్ )యాప్‌ను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.రైతులు యూరియా మరియు ఇతర అవసరమైన ఎరువులను పొందేందుకు తప్పనిసరిగా ఖీతీఋఎవషశీతీని టశీతీ ఖీవతీఅశ్రీఱఓవతీ ూఋశ్రీవ (ఫ్రెమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ )యాప్ ద్వారా ముందుగా బుకింగ్ చేసుకోవాలని ఎ డి ఎ సూచించారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవడం వల్ల రైతులు ఎరువుల లభ్యతను తెలుసుకోవడంతో పాటు,



తమకు అవసరమైన ఎరువులను సులభంగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ విధానం ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు, రైతులకు సమయానికి అవసరమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవచ్చని అమీనా బి తెలిపారు. రైతులు నేరుగా ఎరువుల కోసం విక్రయ కేంద్రాల వద్దకు వచ్చి ఇబ్బందులు పడకుండా, ముందుగానే యాప్‌లో బుకింగ్ చేసుకోవాలని ఆమె సూచించారు.రైతులు తమ మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎ ఇ ఓ )లు అందిస్తున్న సూచనలను పాటిస్తూ యాప్ ద్వారా బుకింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. యాప్ వినియోగంపై ఏవైనా సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే సమీపంలోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా అందుబాటులో ఉంది. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా (ఫ్రెమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ )యాప్ ద్వారా తప్పనిసరిగా బుకింగ్ చేసుకుని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎరువులు పొందాలి" అని మెదక్ డివిజన్ ఏ డి ఎ అమీనా బి పేర్కొన్నారు. రైతులు ఎరువుల విషయంలో అపోహలు, వదంతులను నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని అధికారులు సూచించారు. యూరియా కొరత లేకుండా రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందించేలా వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు.

# బిజినెస్


# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

హైదరాబాద్:
పసిడి ప్రియులకు మరోసారి షాక్ తగిలింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శనివారం బంగారం ధరలు పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,520 పెరిగి రూ.1,63,090కి చేరింది. దీంతో పసిడి ధర మరోసారి గరిష్ఠ స్థాయిల వైపు కదులుతోంది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా పెరిగింది. రూ.1,400 పెరుగుదలతో రూ.1,49,500కి చేరింది. వరుసగా బంగారం ధరలు పెరుగుతుండటంతో కొనుగోలుదారులపై అదనపు భారం పడుతోంది. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారు ధరల పెరుగుదలతో ఆందోళన చెందుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నగరాన్ని బట్టి బంగారం ధరల్లో స్వల్పంగా తేడాలు ఉండే అవకాశం ఉంది. అలాగే ప్రకటించిన ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఆభరణాల కొనుగోలు సమయంలో మొత్తం ధర మరింత పెరిగే అవకాశం ఉంది. బంగారం



ధరలు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ మారకం విలువ, దేశీయ డిమాండ్, భౌగోళిక-రాజకీయ పరిణామాలు వంటి పలు అంశాలపై ఆధారపడి రోజువారీగా మారుతూ ఉంటాయి. ప్రస్తుత పెరుగుదల నేపథ్యంలో పసిడి కొనుగోలు చేయాలనుకునేవారు మార్కెట్ ధరలను పరిశీలించి నిర్ణయం తీసుకోవడం మంచిదని వ్యాపార వర్గాలు సూచిస్తున్నాయి.

## అమెరికాతో రూ.3,800 కోట్లకు టిక్‌టాక్ ఒప్పందం



వాషింగ్టన్
చిన్నారుల భద్రత, వ్యక్తిగత సమాచార సేకరణకు సంబంధించిన కేసులో ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీకి వచ్చింది. ఈ కేసును ముగించేందుకు అమెరికా న్యాయ విభాగానికి 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,800 కోట్లు) చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో 2024లో దాఖలైన వ్యాజ్యం ముగిసినట్లైంది. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ముందు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని నిర్దేశించే చట్టాన్ని టిక్‌టాక్, దాని మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ ఉల్లంఘించాయని అమెరికా న్యాయ శాఖ ఆరోపించింది. ఈ నిబంధనలను పాటించకుండా చిన్నారుల సమాచారాన్ని సేకరించారన్న ఆరోపణలపై ప్రభుత్వం న్యాయపరమైన చర్యలు చేపట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో బైట్‌డ్యాన్స్ అమెరికాలో తన వాటాను తగ్గించుకోవడంతో పాటు కొత్త జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ఒరాకిల్, సిల్వర్ లేక్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకుంది. టిక్‌టాక్ ఇప్పటికే పిల్లల భద్రత, వినియోగదారుల గోప్యతకు సంబంధించి పలు వ్యాజ్యాలను ఎదుర్కొంటోంది. చిన్నారుల వ్యక్తిగత సమాచార పరిరక్షణ, సోషల్ మీడియా వేదికల బాధ్యతపై అమెరికాలో చర్చ జరుగుతున్న సమయంలో టిక్‌టాక్ తాజా రాజీ ఒప్పందం ప్రాధాన్యం సంతరించుకుంది. భారీ మొత్తంలో జరిమానా చెల్లించేందుకు అంగీకరించడం ద్వారా కేసును ముగించేందుకు టిక్‌టాక్ ముందుకు వచ్చింది.

## బీఎండబ్ల్యూ సరికొత్త ఎక్స్1 కారు

**-రూ.49.9 లక్షల ప్రారంభ ధర..**
**- తొలిసారి లగ్జరీ కారు కొనేవారిపై దృష్టి**



న్యూఢిల్లీ:
జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ భారత మార్కెట్లో కొత్త ఎక్స్1 మోడల్‌ను పరిచయం చేసింది. తొలిసారిగా లగ్జరీ కారును కొనుగోలు చేసే వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఈ మోడల్‌ను తీసుకొచ్చినట్లు సంస్థ తెలిపింది. ఎక్స్1 ప్రారంభ ధరను రూ.49.9 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధర న్యూఢిల్లీ ఎక్స్‌షోరూం ధరగా పేర్కొంది. భారత మార్కెట్లో ఈ ఏడాది 25 కొత్త మోడళ్లను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో హర్దీప్ సింగ్ బ్రార్ తెలిపారు. ఇప్పటికే 13 కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కొత్త మోడళ్ల ద్వారా విభిన్న వర్గాల వినియోగదారులను ఆకట్టుకోవడంతో పాటు దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సంస్థ భావిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు బీఎండబ్ల్యూ 9 వేలకు పైగా కార్లను విక్రయించినట్లు బ్రార్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే అమ్మకాలు 17 శాతం పెరిగినట్లు చెప్పారు. భారతదేశంలో బీఎండబ్ల్యూ కార్లకు పెరుగుతున్న ఆదరణకు ఈ విక్రయాల వృద్ధి నిదర్శనమని పేర్కొన్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల్లోనూ సంస్థ గణనీయమైన వృద్ధిని సాధించింది. ఈ ఏడాది ఈవీల అమ్మకాలు 78 శాతం పెరిగినట్లు బీఎండబ్ల్యూ వెల్లడించింది. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ విభాగంలోనూ సంస్థ మరిన్ని మోడళ్లను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారిస్తోంది. కొత్త ఎక్స్1 మోడల్‌తో పాటు బీఎండబ్ల్యూ ఐ5 మోడల్‌ను కూడా ప్రదర్శించింది. ఒకవైపు లగ్జరీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందిపుచ్చుకుంటూనే, మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాల విభాగాన్ని విస్తరించేందుకు సంస్థ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది.

# స్పోర్ట్స్

## డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అట్టడుగుకు పడిపోయిన పాక్

**-ఫైనల్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించిన పాకిస్థాన్**
**--ఇంగ్లాండ్ చేతిలో పరాజయంపై మారిన సమీకరణాలు**

లీడ్స్‌లోని హెడింగ్లే వేదికగా ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లాండ్ చేతిలో ఇన్నింగ్స్, 103 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయిన పాకిస్థాన్ జట్టుకు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పరంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ దారుణ పరాజయంతో ఐసీసీ డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో పాకిస్థాన్ అత్యంత దయనీయ స్థితికి చేరుకుని అట్టడుగున 9వ స్థానానికి పడిపోయింది. రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్ వైఫల్యంతో 3 రోజుల వ్యవధిలోనే రెండుసార్లు ఆలౌట్ అయింది పాక్. దీంతో డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో పాకిస్థాన్ ప్రదర్శన దారుణంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌లలో కేవలం 2 విజయాలు మాత్రమే సాధించింది పాక్. ఏకంగా 5 మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది. దీంతో 16 పాయింట్లతో వారి విజయ శాతం కేవలం 19.05%కి పడిపోయింది. వెస్టిండీస్ (20.83%), ఇంగ్లాండ్ (29.76%) కంటే దిగువకు చేరి చివరి








స్థానంలో నిలిచింది. ఆ జట్టు మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిచినా కూడా ఫైనల్ చేరేందుకు అవసరమైన కనీస పాయింట్ల శాతం సాధించడం కష్టమేమరోవైపు డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఆసీస్ 9 మ్యాచ్‌లలో 7 విజయాలతో 77.78% విజయ శాతంతో, అగ్రస్థానంలో స్థిరంగా ఉంది. సౌతాఫ్రికా (75.00%) రెండో స్థానంలో, న్యూజిలాండ్ (72.22%) మూడో స్థానంలో, బంగ్లాదేశ్ (66.67%) నాలుగో స్థానంలో కొనసాగుతున్నాయి. భారత జట్టు 10 మ్యాచ్‌ల్లో 5 విజయాలు, 64 పాయింట్లతో 53.33% సాధించి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్ రేసులో పోటీపడుతోంది.ఇంగ్లాండ్‌తో జరగబోయే మిగిలిన రెండు టెస్టుల్లో పాకిస్థాన్ అద్భుతం చేసి గెలిచినా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడం దాదాపు అసాధ్యమే. ఈ పర్యటనలో భాగంగా ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్ల మధ్య రెండో టెస్టు ఆగస్టు 27 నుంచి జరగనుంది. ప్రముఖ క్రికెట్ స్టేడియం లార్డ్స్‌లో ఈ మ్యాచ్ జరుగుతుంది. గాయంతో తొలి టెస్టుకు దూరమైన బాబర్ ఆజమ్.. రెండో టెస్టులో ఆడే అవకాశం ఉంది.

## నాకు లైక్స్, వ్యూస్ కంటే ట్రోఫీలు గెలువడమే ముఖ్యం



భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడవద్దని అన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టంచేశారు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియా లో లైక్స్ , వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలువడమే ముఖ్యమని చెప్పారు.శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోందని, గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించిందని గంభీర్ గుర్తుచేశారు. రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉందని, కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుందని చెప్పారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైందని అన్నారు.న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్‌ల్లో ఓటములు ఎదురయ్యాయని, ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైందని, అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ చెప్పారు. తాము టెస్టు క్రికెట్‌లో ఇబ్బంది పడటం లేదని, ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నామని అన్నారు. తనకు ట్రోఫీలు గెలువడమే ముఖ్యమని, తాను పట్టించుకునేది అదేనని గంభీర్ స్పష్టంచేశారు. అదేవిధంగా కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తంచేశారు. కొలంబోలో 20 వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పారు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నారు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నారు. క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజమని, ఆటగాళ్లకు మరింత సమయం ఇవ్వాలని సూచించారు. గిల్, పడిక్కల్, సుతార్‌లపై గంభీర్ విశ్వాసం ప్రకటించారు. ఇక మూడు టెస్టుల సిరీస్‌లకు గంభీర్ మద్దతు తెలిపారు. తొలి టెస్టులో ఓడిన జట్టుకు పుంజుకునే అవకాశం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో ప్రస్తుత సిరీస్ రెండు టెస్టులకే పరిమితం కావడంతో రెండో మ్యాచ్ ఫలితమే సిరీస్‌ను నిర్ణయించనుందని అన్నారు.

## రెండో టెస్టులో నిప్పులు చెరిగిన ఆసీస్ పేసర్లు

**తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 64 రన్స్‌కి ఆలౌట్**
**ఆరు వికెట్లు పడగొట్టిన స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్**

తొలి టెస్టులో ఆస్ట్రేలియాను ఓడించి చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్‌కు రెండో టెస్టు తొలి రోజే దిమ్మతిరిగే షాక్ తగిలింది. మ్యాకేలోని గ్రేట్ బారియర్ రీఫ్ అరేనా వేదికగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా, ఊహించని రీతిలో చెలరేగిపోయింది. పిచ్‌పై ఉన్న తేమను పక్కాగా వాడుకున్న ఆసీస్ పేస్ దళం, మ్యాచ్ ప్రారంభమైన మొదటి ఓవర్ నుంచే బంగ్లాదేశ్ బ్యాటర్లను క్రీజులో నిలబడనీయకుండా పెవిలియన్‌కు పంపించింది. ఫలితంగా బంగ్లాదేశ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో కేవలం 64 పరుగులకే ఆలౌటైంది.ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ బ్యాటర్ల స్కోర్‌బోర్డ్ పరిశీలిస్తే ఏదైనా మొబైల్ నంబర్ లేదా పిన్ కోడ్ టైప్ చేస్తున్నారా అన్నట్టుగా తయారైంది! ‘0, 0, 9, 0, 5, 0 ఇవి తొలి ఆరుగురు బ్యాటర్లు నమోదు చేసిన స్కోర్లు. టాప్ అండ్ మిడిల్ ఆర్డర్‌లో ఏకంగా నలుగురు ప్రధాన



బ్యాటర్లు షాద్‌మాన్ ఇస్లామ్, తంజిద్ హసన్, కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో, వికెట్ కీపర్ లిటన్ దాస్‌లు కనీసం ఖాతా తెరవకుండా డకౌట్ అయ్యారు. జట్టు మొత్తంలో షరీఫుల్ ఇస్లామ్ (14) చేసిన పరుగులే అత్యధికం. అతడు 10వ స్థానంలో బ్యాటింగ్‌కు రావడం గమనార్హం. ఆస్ట్రేలియా బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగాడు. వేగంతో పాటు స్వింగ్‌ను జోడించి 10 ఓవర్లలో 6 మెయిడిన్లతో కేవలం 12 పరుగులే ఇచ్చి ఏకంగా 6 వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. అతడికి తోడుగా ఆసీస్ సారథి ప్యాట్ కమ్మిన్స్ 10 ఓవర్లలో 25 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకోగా, జోష్ హేజిల్‌వుడ్ ఒక వికెట్ సాధించి బంగ్లాను 64 పరుగులకే కట్టడి చేయడంలో తమ వంతు పాత్ర పోషించారు.కేవలం 39 పరుగులకే 9 వికెట్లు కోల్పోయిన దశలో, ఆఖరి వికెట్‌కు తైజుల్ ఇస్లామ్ (11 నాటౌట్), షరీఫుల్ ఇస్లామ్ (14) కలిసి 25 పరుగులు జోడించడంతో బంగ్లాదేశ్ ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. తొలి టెస్టు గెలిచి సిరీస్‌పై కన్నేసిన బంగ్లాదేశ్‌ను మొదటి రోజే 64 రన్స్‌కే ఆలౌట్ చేయడం ద్వారా ఆస్ట్రేలియా మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం సాధించింది.



## రకుల్ ప్రీత్ హాట్ ఫొటో షూట్..

# 'జైలర్ 2' నుంచి హుషారెత్తించే ఫస్ట్ సింగిల్..

### - 'అలా బోలేలో' సాంగ్ వచ్చేసింది!



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో వస్తోన్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ చిత్రం 'జైలర్ 2' (ఝుఅశ్రీవతీ 2). సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ తొలి పాటను విడుదల చేశారు. 'జైలర్' మొదటి భాగంలో తమన్నాపై వచ్చిన 'కావాలావయ్యా' సాంగ్ దేశవ్యాప్తంగా ఎలాంటి సంచలనాలు సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అదే సెంటిమెంట్‌ను రిపీట్ చేస్తూ 'జైలర్ 2' నుంచి 'అలా బోలేలో' అంటూ సాగే హుషారైన స్పెషల్ సాంగ్ లిరికల్ వీడియోను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో నటి పూర్ణ అదిరిపోయే స్టెప్పులతో ఈ స్పెషల్ సాంగ్‌లో మెరిశారు. ట్రెండీ బీట్స్‌తో కూడిన ఈ పాటకు రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ తనూ స్వయంగా ఆలపించి, అదిరిపోయే సంగీతం అందించారు. తెలుగు వెర్షన్‌కు శ్రీనివాస మౌళి చక్కని సాహిత్యం అందించగా, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ ఈ పాటను మరింత కలర్‌ఫుల్‌గా మార్చింది. సాంగ్ మధ్యలో రజనీకాంత్ స్టైలిష్ ఎంట్రీ, ఆయన గ్రేస్ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇదిలాఉంటే, ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# రాకా సినిమా కోసం ప్రత్యేక ప్రపంచం సృష్టి

### సినిమా షూటింగ్‌ను సందర్శించిన మంచు లక్ష్మి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అట్లీ తన గత చిత్రాలకు భిన్నంగా ఈసారి సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌ను ఎంచుకోవడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటికే అల్లు అర్జున్ లుక్, అట్లీ మేకింగ్ స్టైల్ గురించి రకరకాల వార్తలు వైరల్ అవుతుండగా.. తాజాగా నటి మంచు లక్ష్మి చేసిన కామెంట్స్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. ఇటీవల మంచు లక్ష్మి 'రాకా' షూటింగ్ జరుగుతున్న సెట్స్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. అక్కడ జరుగుతున్న చిత్రీకరణను చూసి తాను ఆశ్చర్యపోయానని ఆమె చెప్పకొచ్చారు. ముఖ్యంగా సినిమా కోసం సృష్టించిన ప్రపంచం, భారీ సెట్స్, విజువల్ ఎలిమెంట్స్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇప్పటివరకు తాను చూడని ఒక కొత్త ప్రపంచాన్ని అక్కడ చూశానని మంచు లక్ష్మి పేర్కొన్నారు. సినిమాలో భాగంగా కనిపించే కొన్ని జీవులు, ప్రాణుల డిజైన్లు కూడా తనను ఆశ్చర్యానికి గురిచేశాయని ఆమె వెల్లడించారు. దీంతో 'రాకా' సాధారణ యాక్షన్ సినిమా కాదనే విషయం మరింత స్పష్టమవుతోందనే చర్చ మొదలైంది. 'రాకా'ను సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు సినిమాలోని ప్రపంచం ఎలా ఉండబోతుందనే ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. కొత్త తరహా విజువల్స్, భారీ యాక్షన్ సీక్వెన్సులు, ఊహకు అందని క్రియేచర్స్‌తో దర్శకుడు అట్లీ ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో 'పుష్ప' సినిమాతో సొంతం చేసుకున్న క్రేజ్‌కు తగ్గట్టుగానే ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్కేల్‌లో రూపొందించేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్, అట్లీ కలిసి ఎలాంటి విజువల్ వండర్‌ను సృష్టించబోతున్నారో తెలియాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం మాత్రం మంచు లక్ష్మి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ 'రాకా'పై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తున్నాయి.



# ఇరుముడి బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్



మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో మంచి జోష్‌లో దూసుకెళ్తుంది. రిలీజ్ అయిన ఫస్ట్ డేనే పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా.. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనతో భారీ వసూళ్ల దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో 'ఇరుముడి'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే పూర్తి నమ్మకంతో ముందుకు వెళ్లినట్లు సమాచారం. కథ, కాన్సెప్ట్‌పై నమ్మకం ఉన్నప్పటికీ.. ఓటీటీ రైట్స్ విషయంలో సినిమా స్టార్టింగ్‌లో మాత్రం అనుకున్న స్థాయిలో ఆసక్తి కనిపించలేదనే ప్రచారం జరిగింది. ముఖ్యంగా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ తొలుత 'ఇరుముడి' డిజిటల్ రైట్స్‌పై పెద్దగా ఆసక్తి చూపలేదని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపించింది. అయినప్పటికీ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్కడా వెనక్కి తగ్గకుండా.. కథ, రవితేజ పాత్ర, శివ నిర్వాణ టేకింగ్‌పై ఉన్న నమ్మకంతో ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. సినిమా ప్రమోషన్స్ మొదలైన తర్వాత పరిస్థితులు మారినట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ముఖ్యంగా 'ఇరుముడి' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తర్వాత సినిమాపై ఒక్కసారిగా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరగడంతో పాటు, ఈ చిత్రంలో రవితేజను ఇంతకుముందెన్నడూ చూడని విధంగా కొత్త తరహా పాత్రలో చూపిస్తున్నారనే విషయం బయటకు రావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు ఈ మూవీపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ క్రేజ్‌ను గమనించిన నెట్‌ఫ్లిక్స్.. ఆ తర్వాత 'ఇరుముడి' డిజిటల్ రైట్స్ కొనుగోలుకు ఆసక్తి చూపినట్లు ప్రచారం జరుగుతోంది. చివరకు మైత్రీ మూవీ మేకర్స్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఓటీటీ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు ప్రస్తుతం సినీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం థియేటర్లలో ఈ సినిమాకు వస్తున్న స్పందనను చూస్తే.. మైత్రీ మూవీ మేకర్స్ ఈ కథపై పెట్టుకున్న నమ్మకం ఫలించినట్లే కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవైపు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా మంచి వసూళ్లు సాధించే దిశగా దూసుకెళ్తుండగా.. మరోవైపు డిజిటల్ రైట్స్ దక్కించుకున్న నెట్‌ఫ్లిక్స్‌కు కూడా ఈ విజయం కలిసొచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# చిరు సినిమాకు కాకాగా టైటిల్

### బర్త్‌డే సందర్భంగా టైటిల్ రిలీజ్




అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీమ్ అప్‌డేట్ ఇచ్చింది. సినిమా టైటిల్‌ను 'కాకా'గా ఖరారు చేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది. ఇందులో చిరంజీవి మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. అక్వా సంస్థలో ఉద్యోగిగా చిరంజీవి సత్యం అనే పాత్రలో నటిస్తున్నారు. 'ఇది సత్యం మాట.. ఇంకా డౌటా' అనే డైలాగు ఆయన పాత్ర స్వభావాన్ని తెలుపుతోంది. ఇందులో కనిపించిన 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్‌కు.. ఫ్లాష్ బ్యాక్‌లో ఆయనకు తండ్రితో అనుబంధం ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. టైటిల్ రివీల్ అనంతరం యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజు.. మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ చిరును గుర్తుచేస్తోంది. ఇక 'కాకా' సినిమా సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com